



వినుకొండ: మార్కెట్ యార్డులో చెక్కును పంపిణీ చేస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి రవికుమార్, ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, కలెక్టర్ అరుణ్‌బాబు



దుర్గి: ముట్కూర్‌లో అన్నదాత సుఖీభవ చెక్కును రైతులకు అందజేస్తున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి



సత్తెనపల్లి: సత్తెనపల్లి మార్కెట్ యార్డులో చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



నరసరావుపేట: ఇస్సపాలెంలో అన్నదాత సుఖీభవ చెక్కును రైతులకు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

అన్నదాత.. సుఖీభవ



పిడుగురాళ్ల: రైతులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, జంగా కృష్ణమూర్తి

జిల్లాలో వర్షాభావ పరిస్థితులు ఉన్నా కాల్వల్లో సాగునీరు పరవళ్లు తొక్కుతుండగా.. వ్యవసాయ పనుల్లో రైతులు నిమగ్నమై ఉన్నారు. ఈ సమయంలో ప్రభుత్వం శనివారం 'అన్నదాత.. సుఖీభవ' అంటూ రైతుల ఖాతాల్లో నగదు జమ చేసింది. పెట్టుబడి కోసం ఎదురు చూస్తున్న తరుణంలో రూ.7 వేలు నగదు అందడంతో అన్నదాతల్లో ఆనందోత్సాహాల్లో తేలియాడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు హామీ ఇచ్చినట్లుగా సూపర్ సిక్స్‌లో పథకాలను ఒక్కొక్కటి అమలు చేస్తోంది. ఈ క్రమంలో అన్నదాత సుఖీభవ పథకం అమలు ఎప్పుడెప్పుడా అని రైతులు చూస్తున్న తరుణంలో బ్యాంకు ఖాతాలకు నగదు జమ కావడంతో కర్షకుల కళ్లల్లో ఆనందం వెల్లివిరిసింది. జిల్లాలో అన్నదాత సుఖీభవ.. పీఎం కిసాన్ పథకాన్ని శనివారం పండుగ వాతావరణంలో ప్రజాప్రతినిధులు, అధికారులు లాంఛనంగా ప్రారంభించారు. కూటమి నేతలు, కార్యకర్తలు, రైతులు ఎక్కడికక్కడ ఈ కార్యక్రమాన్ని ఓ వేడుకలా జరుపుకున్నారు. పలు ప్రాంతాల్లో ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్య మంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు రైతులు పాలాభిషేకం చేసి వారికి కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వం కంటే రూ.6,500 అదనంగా కూటమి ప్రభుత్వం అందస్తుండటంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేశారు.



ఆర్థిక సాయంతో ఆనందోత్సాహాలు

- రైతుల బ్యాంకు ఖాతాలకు రూ.7 వేలు జమ
- జిల్లాలో వేడుకలా సుఖీభవ పథకం ప్రారంభం
- 2,39,959 రైతులకు రూ.167.97 కోట్లు పంపిణీ



క్రోసూరు మార్కెట్ యార్డులో రైతులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

గత కొన్ని రోజులుగా అన్నదాత సుఖీభవ పథకం అమలుకు సంబంధించి అధికారులు పెద్దఎత్తున కసరత్తు చేశారు. జిల్లాలోని ఏ రైతూ నష్టపోకుండా అర్హులందరికీ పథకం వర్తించేలా చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో తొలుత ప్రభుత్వం గత నెలలో జాబితాలను రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచి అనర్హులు మళ్లీ దరఖాస్తు చేసుకునే అవకాశం ఇచ్చింది. జిల్లాలో 2,39,959 మంది రైతులకు అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులుగా గుర్తించారు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకాన్ని శనివారం ప్రారంభిస్తున్నట్లు ప్రకటించగానే రాష్ట్ర ప్రభుత్వం కూడా అన్నదాత సుఖీభవ నిధుల విడుదలకు ఏర్పాట్లు చేసింది. దీంతో జిల్లాలోని 2,39,959 మంది రైతుల ఖాతాల్లో పీఎం కిసాన్ రూ.2000, సుఖీభవ రూ.5000 వేర్వేరుగా రూ.167.97 కోట్లు ప్రభుత్వం జమ చేసింది. తొలుత రూ.2,000 జమైనట్లుగా, ఆ తర్వాత రూ.5000 ఖాతాల్లో నగదు పడినట్లు సందేశాలతో రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. ఈ క్రాప్ నమోదు చేసుకున్న కౌలు రైతులకు మాత్రమే సుఖీభవ అందుతుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

అట్టహాసంగా కార్యక్రమాలు

- వినుకొండ మార్కెట్ యార్డులో జిల్లా స్థాయిలో అన్నదాత సుఖీభవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, కలెక్టర్ అరుణ్ బాబు, జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, వ్యవసాయ శాఖ జేడీ జగ్గారావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సహకారంతో ప్రతి ఏటా రైతులకు రూ.20 వేలు పెట్టుబడి సాయం ప్రభుత్వం అందిస్తుందన్నారు.
- పిడుగురాళ్లలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సుఖీభవ చెక్కును రైతులకు అందజేశారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పులుకూరి కాంతారావు, టీడీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి పాల్గొన్నారు.
- సత్తెనపల్లిలో పథకాన్ని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ప్రారంభించి రైతులకు చెక్కు అందజేశారు. రైతు మిత్ర సంఘానికి డ్రోన్‌ను అందజేశారు. యార్డులో పొగాకు కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు.



యడ్లపాడులో రైతులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

- చిలకలూరిపేట నియోజకవర్గం యడ్లపాడులో ఎమ్మెల్యే ప్రత్తి పాటి పుల్లారావు ప్రారంభించి రైతులకు చెక్కును అందజేశారు.
- మాచర్ల నియోజకవర్గం దుర్గి మండలం ముట్కూరులో అన్నదాత సుఖీభవ పథకం చెక్కులను రైతులకు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అందజేశారు.
- నరసరావుపేట మండలం ఇస్సపాలెంలో మార్కెట్ యార్డు చైర్మన్ పూనాటి శ్రీనివాసరావుతో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు రైతులకు చెక్కును అందజేశారు.
- పెదకూరపాడు నియోజకవర్గం క్రోసూరు మార్కెట్ యార్డులో సుఖీభవ పథకాన్ని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ప్రారంభించి రైతులకు చెక్కును అందజేశారు.



శాశ్వతం.. స్నేహితం!

- కొత్త మార్గాల్లో స్నేహ హస్తాలు..
- తగ్గిన స్నేహితుల సంఖ్య..
- నేడు స్నేహితుల దినోత్సవం..

8





గవర్నర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న డాక్టర్ లావు రత్తయ్య వీసీ నాగభూషణ్ తదితరులు

సాంకేతిక నగరంగా అమరావతి

- క్వాంటం టెక్నాలజీకి దిక్సూచిగా ఆంధ్రప్రదేశ్
- విజ్ఞాన్స్ వర్సిటీ స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్‌నజీర్
- ముగ్గురికి గౌరవ డాక్టరేట్లు.. 2122 డిగ్రీలు.. 60 బంగారు పతకాల పంపిణీ

8

జిల్లాలో మరో 184 పోలింగ్ కేంద్రాలు

నరసరావుపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం కొత్తగా 184 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. ఓటర్ల సంక్షిప్త సవరణపై కలెక్టరేట్‌లో శనివారం రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. 2026 ప్రత్యేక సంక్షిప్త సవరణ ప్రకారం జిల్లాలోని పోలింగ్‌స్టేషన్ల ఏర్పాటు, మార్పులు, చేర్పులపై రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలెక్టర్ చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ఒక్కో పోలింగ్ బూత్‌కు 1,200 ఓటర్లు మించి ఉండకూడదన్నారు. ఈ ప్రకారం జిల్లాలో ప్రస్తుతం ఉన్న పోలింగ్ కేంద్రాలను విభజించామన్నారు. జిల్లాలో గతంలో 1,932 పోలింగ్ కేంద్రాలు ఉండగా పెరిగిన వాటితో ఆ సంఖ్య 2,115కు చేరిందన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో మురళి, ఆర్డీవోలు మధులత, రమా కాంతరెడ్డి, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో కలెక్టర్ అరుణ్‌బాబు, డీఆర్వో మురళి



త్వరలో జీజీహెచ్‌లో కాలేయ మార్పిడి శస్త్ర చికిత్సలు!

- రూ.30 లక్షల విలువైన సర్జరీలు ఉచితంగా..
- సూపరింటెండెంట్ రమణ యశస్వి

రేషన్ ఇవ్వకుంటే కఠిన చర్యలు

- చౌక దుకాణాల్లో జేసీ సూరజ్ ధనుంజయ్
- జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో తనిఖీలు.. కేసులు



గుండ్లపల్లిలో రేషన్ షాపును తనిఖీ చేస్తున్న జేసీ సూరజ్ ధనుంజయ్ గనోరే

నకరికల్లు, వినుకొండ టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): డీలర్లు రేషన్ సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని, లేకుంటే కఠినంగా చర్యలు తీసుకుంటామని జేసీ సూరజ్ ధనుంజయ్ గనోరే తెలిపారు. శనివారం పౌర సరఫరాలు, రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో జిల్లాలోని పలు రేషన్ దుకాణాలతో పాటు రైస్ మిల్లుల్లో తనిఖీలు జరిగాయి. ఈ క్రమంలో జేసీ నకరికల్లు మండలం గుండ్లపల్లి, నకరికల్లులోని రేషన్‌షాపుల్లో తనిఖీలు చేశారు. రేషన్ సక్రమంగా ఇస్తున్నారా? లేదా? అని దుకాణాల వద్ద కార్డుదారులను జేసీ ప్రశ్నించారు. రేషన్ పంపిణీని, స్టాక్ వివరాలను పరిశీలించారు. తహసీల్దారు పుల్లారావు, డీటీ కొండారెడ్డి, ఆర్ఐ సుబ్బయ్య, వీఆర్వోలు ఎస్‌కే సైదా, పీ శారదాలు జేసీ వెంట ఉన్నారు.

- నిత్యావసర సరుకుల్లో వ్యత్యాసాలు ఉన్నట్లు గుర్తించి రొంపిచర్ల మండలంలో 29, ఈపూరు మండలంలో 11, బొల్లాపల్లి మండలం రేమిడిచర్ల గ్రామంలోని 38వ నెంబరు చౌక దకాణాలపై అధికారులు కేసులు నమోదు చేశారు. వినుకొండలోని సాయి బాలాజీ రైస్ మిల్లులో ఎటువంటి పత్రాలు లేకుండా నిల్వ ఉంచిన 45.50 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని సీజ్ చేసి సంబంధితులపై 6ఏ కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

మిర్చి బీమాకు గడువు పొడిగింపు

31వ తేదీ వరకు రైతులకు అవకాశం

నరసరావుపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మిరప పంటకు బీమా పథకాన్ని 31 వరకు పొడిగించినట్లు జిల్లా ఉద్యానశాఖ అధికారి వెంకట్రావు శనివారం తెలిపారు. ఎకరాకు రూ.360 ప్రీమియం చెల్లిస్తే ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన వర్తిస్తుందన్నారు. ఎకరాకు బీమా రూ.90,000గా నిర్ణయించినట్లు తెలిపారు. తుఫాన్లు, అకాల వర్షాలు, కరువు వంటి ప్రకృతి వైపరీత్యాల్లో నష్టపోయిన రైతులకు బీమా ద్వారా పరిహారం చెల్లిస్తారన్నారు. ప్రీమియం చెల్లిస్తే కౌలు రైతులకు కూడా బీమా వర్తిస్తుందన్నారు.

అప్‌గ్రేడ్ ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలి

ఫ్యాప్టో ధర్నాలో ఉపాధ్యాయ సంఘ నేతల డిమాండ్

నరసరావుపేట టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నూతనంగా అప్‌గ్రేడ్ అయిన స్థానాల్లో నియమితులైన ఉపాధ్యాయులకు తక్షణమే జీతాలు చెల్లించాలని ఆంధ్ర ప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) డిమాండ్ చేసింది. నరసరావుపేటలోని గాంధీపార్కు వద్ద శనివారం ఫ్యాప్టో ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధన తప్ప ఏ ఇతర కార్యక్రమాలు లేకుండా చేయాలన్నారు. ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్యలు పరిష్కరించి విద్యాశాఖలో ఉన్న అసంబద్ధతను తొలగించాలన్నారు. హైస్కూల్ ప్లస్‌లలో వెంటనే ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఆంగ్లంతో పాటు తెలుగు మాధ్యమాన్ని కూడా సమాంతరంగా కొనసాగించాలని, విద్యార్థులకు పరీక్షలను తెలుగులో రాసే అవకాశం కల్పించాలన్నారు. ధర్నా అనంతరం కలెక్టరేట్‌లో జేసీ సూరజ్ ధనుంజయ్ గనోరేకు సంఘ నేతలు వినతిపత్రం అందజేసి డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాసా రాంబాబు, ఫ్యాప్టో జిల్లా చైర్మన్ ఎల్‌వీ రామిరెడ్డి, జనరల్ సెక్రటరి సంపత్‌బాబు, కో చైర్మన్లు వీరాంజనేయులు, చంద్రయ్య, మోహిద్దీన్‌బాషా, డిప్యూటీ సెక్రటరిలు మోహనరావు, ఉస్మాన్, కోశాధికారి గోవిందరాజులతో పాటు ఎస్టీయూ, ఏపీటీఎఫ్ యూటీఎఫ్ నేతలు జోసఫ్ సుధీర్, మక్కెన శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డి, కోటేశ్వరరావు, చంద్రజిత్‌యాదవ్, పాల్గొన్నారు.



ఫ్యాప్టో ఆధ్వర్యంలో గాంధీ పార్కు వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గురజాలటౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని హైవే మలుపు వద్ద బైకు అదుపు తప్పి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. అంజనాపురం గ్రామానికి చెందిన కాసాని నాగిరెడ్డి (40) దాచేపల్లి వెళ్తుండగా.. బైకు అదుపు తప్పి కింద పడిపోయాడు. దీంతో అతని తలకు బలమైన గాయమైంది. స్థానికులు నాగిరెడ్డిని గురజాల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	106, 114, 125
చికెన్ విత్ స్కిన్(కిలో)	204.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	214.00

మత్స్యకారుడి మృతదేహం లభ్యం

విజయపురిసౌత్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మాచర్ల మండలం అనుపు కృష్ణా జలాశయంలో బుధవారం గల్లంతైన మత్స్యకారుడు దోనె ధనరాజు (40) మృతదేహం శనివారం లభ్యమైంది. విజయపురి సౌత్ ఎస్ఐ అశోక్ ఆధ్వర్యంలో ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బందితో రెండు రోజులుగా జలాశయంలో గాలించారు. అనుపునకు కిలోమీటరు సమీపంలో ధనరాజు మృత దేహాన్ని గుర్తించి బయటకు తీశారు. ధనరాజు మృతికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలిచారు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

కాలువలో పడి వివాహిత మృతి

మాచర్లటౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ కుడి కాలువలో ప్రమాదవశాత్తూ పడి వివాహిత మృతి చెందిన ఘటన మాచర్ల పట్టణ శివారులో చోటుచేసుకుంది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. రెంటచింతల మండలం తుమ్మకోట గ్రామానికి చెందిన పతకమూరి లక్ష్మమ్మ (55) మాచర్ల పట్టణ శివారులోని కంభంపాడు బ్రిడ్జి వద్ద నాగార్జున సాగర్ కుడి కాలువలో ప్రమాదవశాత్తూ కాలు జారిపడి మృతి చెందింది. గట్టునే ఉన్న ఆలయానికి శ్రావణ శుక్రవారం పూజలు చేసేందుకు ఆమె వెళ్లింది. శనివారం ఉదయం బుగ్గవాగు రిజర్వాయర్ సమీపంలో మృతదేహం లభ్యమైంది. మాచర్ల ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు మృతదేహాన్ని అప్పగించారు. లక్ష్మమ్మకు భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఎస్ఐ సంధ్యారాణి కేసు నమోదు చేశారు.

పులిచింతలకు 1,36,683 క్యూసెక్కులు

విజయపురిసౌత్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రాజెక్టు ద్వారా పులిచింతలకు 1,36,683 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. నాగార్జున సాగర్ నుంచి 1,65,726 క్యూసెక్కులు నీరు వస్తుండగా 9 గేట్లను 3 మీటర్ల మేర ఎత్తినట్లు అధికారులు పేర్కొన్నారు .రిజర్వాయర్‌లో 74.57 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 6.455 టీఎంసీలకు, 247 అడుగులకు సమానం.

చిత్తశుద్ధితో ఎన్నికల హామీల అమలు

● వైసీపీ అక్రమాలు.. అకృత్యాలను నిగ్గు తేలుస్తాం
● అన్నదాత సుఖీభవ సభలో ఎమ్మెల్యే యరపతినేని


మహిళా రైతుకు నగదు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని, జంగా కృష్ణమూర్తి తదితరులు

పిడుగురాళ్ల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం పిడుగురాళ్లలోని కల్యాణ మండపంలో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ ప్రారంభోత్సవ సభ రైతులు, పార్టీ శ్రేణులతో కలిసి నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నట్లు యరపతినేని ఈ సందర్భంగా తెలిపారు. ఆగస్టు 15న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని అమలు చేయబోతున్నట్లు వెల్లడించారు. గత నెలలో నడికూడి మార్కెట్ యార్డులో కిసాన్ మేళా పథకం ఎందరో రైతులకు ఉపయోగపడిందన్నారు. బుగ్గవాగు ఆధునీకరణకు నిధుల కేటాయింపు కోసం త్వరలో ముఖ్యమంత్రిని కలవనున్నామని ఆయన తెలిపారు. దాచేపల్లిలో భూ అక్రమాలు, తంగెడ జడ్పీ పాఠశాల స్థలాన్ని సైతం ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకున్న ఘటనలు బయటకు వచ్చాయని, మిగిలిన మండలాల్లో కూడా వైసీపీ హయాంలో జరిగిన భూ అక్రమాలు, ప్రభుత్వ భూముల వివరాలను నిగ్గు తేలుస్తామన్నారు. తమకు అనుకూలంగా అధికారులు లేరన్న ఆక్రోశంతో బట్టలు ఊడదీస్తామని జగన్ మాట్లాడటం సమంజసం కాదని హితవు పలికారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా గురజాల నియోజకవర్గంలో 35,595 మంది రైతులకు రూ.24.92 కోట్ల నిధులు జమ కానున్నాయన్నారు. టీటీడీ బోర్డు సభ్యులు జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రకృతికి అనుకూలంగా పంటలు సాగు చేసే విధానాన్ని రైతులు అలవాటు చేసుకోవాలని రైతులకు సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రైతుపక్షపాతి అన్నారు. ఈ సమావేశంలో నాగార్జునసాగర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పులుకూరి కాంతారావు, మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, ఏఎంసీ చైర్మన్లు వీరస్వామి, బెల్లంకొండ భారతి భద్రి, యరపతినేని నిఖిల్, డాక్టర్ వున్నం నాగమల్లికార్జునరావు, జడ్పీటీసీ జంగా వెంకట కోటయ్య, వేముల వినోద్‌రెడ్డి, కటకం అంకారావు, గండికోట వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రగతిని అడ్డుకునేవారు ప్రజలకు అవసరమా

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు


అన్నదాత సుఖీభవ మెగా నగదు చెక్కును రైతులకు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

యడ్లపాడు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రగతికి అడ్డుపడుతూ తప్పుడు ప్రచారాలు చేసే వారు రాష్ట్రానికి, ప్రజలకు అవసరమా.. అని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రశ్నించారు. యడ్లపాడులో శనివారం అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల తొలి విడత నిధుల విడుదల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి, ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా అడ్డుకునేందుకు తప్పుడు మెయిల్స్ పెడుతున్నారని, అలాంటి వ్యక్తుల గురించి ప్రజలే ఆలోచన చేయాలన్నారు. దుర్మార్గపు ఆలోచన కలిగిన జగన్ లాంటి నాయకుడి చర్యల వల్ల రాష్ట్రానికి ప్రజలకు ఎప్పటికైనా ప్రమాదమేనని తీవ్ర విమర్శలు చేశారు. నియోజకవర్గంలో అన్నదాత సుఖీభవ పథకం కింద.. 21,614మంది రైతులకు రూ.15.13 కోట్లు లబ్ధి చేకూరిందన్నారు. ఇప్పటికే సూపర్-6లో నాలుగు అమలు చేశామని, నెలాఖరుకు మిగిలిన రెండు పథకాలు కూడా అమలవుతాయని ఎమ్మెల్యే ప్రత్తిపాటి స్పష్టం చేశారు. ఆడబిడ్డ నిధి కూడా త్వరలోనే అమలవుతుందన్నారు. అనంతరం అన్నదాత సుఖీభవ పథకం నగదు చెక్కును రైతులకు అందజేశారు. అంతేగాకుండా రైతులకు రాయితీపై కంది విత్తనాలు, డ్వాక్రా మహిళలకు రుణ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త రాజారమేష్, బీజేపీ నాయకులు జయరామిరెడ్డి, యార్డు చైర్మన్ కరిముల్లా, మండల పార్టీ అధ్యక్షులు సాయిబాబు, టీడీపీ నాయకులు సదాశివరావు, పోపూరి వెంకయ్య, వీరారెడ్డి, రఘురామారావు, రాఘవయ్య, నరసరావుపేట ఏడీఏ శ్రీనివాస్, తహసీల్దార్ విజయశ్రీ, ఈఓపీఆర్డీ జాకీర్‌హుస్సేన్, వ్యవసాయాధికారి హరిప్రసాద్ పాల్గొన్నారు.

ఆనంద సాగర్

●లాంచీ స్టేషన్ ఆదాయం రూ. లక్ష


సెల్ఫీలు దిగుతున్న పర్యాటకులు

విజయపురిసౌత్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ 18 క్రస్టగేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తుండడంతో పర్యాటకుల తాకిడి శనివారం భారీగా పెరిగింది. తెలుగు రాష్ట్రాల నుంచి కుటుంబాలతో వచ్చి.. సాగర్ నూతన, పాత బ్రిడ్జి, లాంచీ స్టేషన్ ప్రాంతాల్లో సందడి చేశారు. లాంచీలలో నాగార్జున కొండకు తరలి వెళ్లారు. కొండలోని మ్యూజియం సందర్శించారు. పచ్చని కొండల మధ్య ఉన్న అనుపు, యాంపీ స్టేడియం, అశ్వమేధ యజ్ఞశాల, శ్రీరంగనాథ స్వామి దేవాలయం, ఎత్తిపోతల జలపాతం అందాలను వీక్షించారు. శనివారం లాంచీల ద్వారా రూ.1,00,450 ఆదాయం సమకూరినట్లు యూనిట్ అధికారులు తెలిపారు.

18 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల

నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు శ్రీశైలం నుంచి 2,10,499 క్యూసెక్కుల వరద నీరు చేరుతోంది. శనివారం ప్రాజెక్ట్ అధికారులు ప్రాజెక్ట్ 18 క్రస్ట్‌గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 1,36,656 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,070, కుడి కాలువ ద్వారా 8023 , ఎడమ కాలువ ద్వారా 7937, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో 1,83,786 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 585.30 అడుగులు ఉంది. 298.30 టీఎంసీలకు సమానం.


కొండను సందర్శించిన పర్యాటకులు

అన్ని వర్గాల ప్రజలకు.. పథకాలు అందుతున్నాయి

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి


సమావేశంలో మాట్లాడుతున్న కొమ్మాలపాటి శ్రీధర్

గుంటూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ అమలులో భాగంగా కూటమి ప్రభుత్వం మరో హామీని నెరవేర్చిందని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. గుంటూరులోని తన కార్యాలయంలో శనివారం మాట్లాడుతూ .. ఎన్నికలకు ముందు కేంద్ర ప్రభుత్వ సాయంతో కలిపి రూ.20 వేలు రైతులకు పెట్టుబడి సాయం మూడు విడతలుగా ఇస్తానని చెప్పిన విధంగానే నేడు మొదటి విడతలో రూ.7 వేలు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. గత ప్రభుత్వం.. రూ.13,500 ఇస్తానని చెప్పి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.6 వేలకు.. రూ.7,500 మాత్రమే కలిపి ఇచ్చి మోసం చేసిందని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో ధాన్యం డబ్బుల కోసం రైతులు ఉద్యమాలు నిర్వహించే పరిస్థితి నెలకొందన్నారు. కానీ, నేడు కూటమి ప్రభుత్వం 48 గంటల్లోనే రైతులకు ధాన్యం డబ్బులు చెల్లిస్తోందన్నారు. రూ.1,674కోట్ల బకాయిలను కూడా మన కూటమి ప్రభుత్వం చెల్లించిందని చెప్పారు. ఈ నెల 15 నుంచి ఆడబిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణం నెరవేర్చడం కోసం ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు చెప్పిన విధంగానే అన్ని పథకాలు అందుతుండడంతో ప్రజలకు ప్రభుత్వంపై నమ్మకం ఏర్పడిందని, ఇది తట్టుకోలేని వైసీపీ నాయకులు ప్రభుత్వాన్ని ఏదో ఒక విధంగా ఇరుకున పెట్టాలని, అప్రదిష్టపాలు చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత నాయకులు అబ్బూరి నాగమల్లేశ్వరరావు, నరసింహారావు పాల్గొన్నారు

అన్నదాతల ఆనందమే దేశానికి శ్రీరామరక్ష

● మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి


సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

దుర్గి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): దేశానికి అన్నం పెట్టే అన్నదాతల కుటుంబం ఆనందంగా ఉంటే దేశం సుభిక్షంగా ఉంటుందని, అది ప్రజానికానికి శ్రీరామరక్ష అని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. మండల పరిధిలోని ముటుకూరులో శనివారం ఏర్పాటు చేసిన అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకం ప్రారంభోత్సవం సభలో ఆయన పాల్గొని, మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు రూ. 13 వేలు రైతుల ఖాతాలో జమచేస్తే, కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా మూడు విడతల్లో రూ. 20 వేలు జమ చేస్తుందన్నారు. గత ప్రభుత్వంలో రివర్స్ పాలనతో రాష్ట్రాన్ని తలకిందులు చేసి జగన్‌మోహన్‌రెడ్డి తన పార్టీ సైకోలతో ఇసుక, లిక్కర్, గంజాయి వ్యాపారం చేయించి ప్రజల జీవితాలతో ఆడుకున్నారన్నారు. గాడితప్పిన రాష్ట్రాన్ని గాడిలో పెడుతూ ఒకవైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రధాని మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కృషి చేస్తున్నారన్నారు. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు సహకరించి వరికపూడిశెల నిర్మాణానికి అడ్డుగా మారిన అటవీ శాఖ భూమికి రూ. 14.85 కోట్లు చెల్లించారని అన్నారు. తన తల్లి దుర్గాంబ శాసన సభ్యురాలిగా ఉన్నప్పుడు జెర్రివాగు పూర్తి చేస్తే అది ఇప్పుడు నిరుపయోగంగా ఉందన్నారు. మాచర్లలో 100 పడకల ఆసుపత్రి నూతన భవనాన్ని త్వరలోనే నిర్మిస్తామన్నారు. వైసీపీ నేతలు ఒళ్లు దగ్గర పెట్టుకొని ఉండాలని, రప్పా రప్పా నరుకుతామంటే ఎవరూ చేతులు కట్టుకొని కూర్చోరని, మోసపు యాత్ర అంటూ వైసీపీ నేతలు వస్తే చొక్కా పట్టుకొని నిలదీస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా జగన్‌రెడ్డి బుద్ధి తెచ్చుకొని శవయాత్ర చేయకుండా అభివృద్ధికి సహకరించాలన్నారు. మాచర్ల నియోజకవర్గంలో గత నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, అతని సోదరుడు వెంకట్రామిరెడ్డి చేసిన పాపాలకు పారిపోయారని అన్నారు. ఈ కార్యక్రమంలో జూలకంటి అక్కిరెడ్డి, ఏడీఏ జగదీశ్వరెడ్డి, ఎంపీపీ యేచూరి సునీతాసాయిశంకర్, లింగా బ్రహ్మయ్య, దొండపాటి చెన్నయ్య, లింగా పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ వేత్తకు ప్రకృతి ప్రేమికుల మద్దతు


చెత్త సేకరణలో యువతతో.. అంకారావు

కారంపూడి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి పర్యావరణ వేత్త, ఏపీ ప్రభుత్వ సలహాదారు కొమెర అంకారావు అలియాస్ జాజి ఆశయానికి మద్దతు లభిస్తోంది. నల్లమల ఇతర అటవీ ప్రాంతాల్లో 5 కోట్ల మొక్కలు నాటాలనే ఆయన సంకల్పించారు. శనివారం రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన పర్యావరణ, ప్రకృతి, అటవీ ప్రేమికులు విత్తనాలు, విత్తన బత్తులు భారీ స్థాయిలో తీసుకు వచ్చారు. అడవులలో ఎత్తయిన కొండలు, గుట్టలు, కుంటలు ఎక్కి చల్లారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరించి నాశనం చేశారు. అంకారావు తన మూడు దశాబ్దాల అనుభవాలు చెప్పారు. అటవీ ఔషధ మొక్కలపై అవగాహన కల్పించి, తాను రాసిన పుస్తకాలు పంపిణీ చేశారు. హైదరాబాద్‌కు చెందిన యూత్ ఫర్ సేవ సేవకులు, వన్ ఎర్త్, వన్ లైఫ్ అడ్మిన్ లీలాకుమారి ఏలూరి, సభ్యులు, సెక్రటరీ లక్ష్మి, పద్మ సాయి పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో యువ ఇంజనీర్లు భాగస్వాములు కావాలి

● జేఎన్‌టీయూ(కే) రెక్టార్ ఆచార్య వీవీ సుబ్బారావు
● ఘనంగా కళ్ళం ఇంజనీరింగ్ కళాశాల స్నాతకోత్సవం



విద్యార్థినికి డిగ్రీ పట్టా అందజేస్తున్న జేఎన్‌టీయూ(కె) రెక్టార్ ఆచార్య వీవీ సుబ్బారావు, కళ్ళం మోహనరెడ్డి

గుంటూరు(విద్య), ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): యువ ఇంజనీర్లు నవ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని, దేశాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని జేఎన్‌టీయూ(కే) రెక్టార్ ఆచార్య వీవీ సుబ్బారావు విజ్ఞప్తి చేశారు. చౌడవరంలోని కళ్ళం హరనాథరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకరరెడ్డి అధ్యక్షత వహించారు. ఆచార్య వీవీ సుబ్బారావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవడంతో పాటు ఉద్యోగాల కల్పనకు కృషి చేయాలన్నారు. అప్పుడే దేశ ప్రగతికి బాటలు పడతాయన్నారు. కళాశాల చైర్మన్ కళ్ళం మోహనరెడ్డి మాట్లాడుతూ కళాశాల స్థాపించిన 11 సంవత్సరాల్లోనే ఎన్‌బీఏ, నాక్-ఏ గ్రేడు, స్వయం ప్రతిపత్తి(ఆటానమస్)హోదా సాధించి.. విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలతో విద్యను అందిస్తున్నామని చెప్పారు. . ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి, అకాడమిక్ డీన్ డాక్టర్ షణ్ముఖ రావు, స్నాతకోత్సవ డాక్టర్ సన్నీ డియోల్, కళాశాల అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ కళ్ళం నవ్య, ఉపాధి కల్పన అధికారి డాక్టర్ పీఎల్ మాధవరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందజేశారు.

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యానికి మేలు

● ఎమ్మెల్యే యరపతినేని


కూరగాయలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని, కృష్ణమూర్తి

పిడుగురాళ్ల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు పురుగుమందులు వాడని పంట ఉత్పత్తులను వాడాలని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు రైతులకు సూచించారు. శనివారం పిడుగురాళ్లలో అన్నదాత సుఖీభవ సమావేశంలో ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయలను ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయానికి ప్రభుత్వం పెద్దఎత్తున రాయితీ ఇస్తుందని, రైతులు ఆ దిశగా సాగు చేయాలని యరపతినేని సూచించారు.

రైతులకు అండగా అన్నదాత సుఖీభవ

దాచేపల్లి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకం సామాన్యరైతులకు ఎంతగానో ఉపకరించిందని డీసీవో ఎం నాగరాజు తెలిపారు. శనివారం దాచేపల్లి నగర పంచాయతీ, నారాయణపురం, పీఏసీఎస్‌లో కూటమి నేలతో కలసి ప్రధాని మోడీ ప్రసంగాన్ని టీవీలో వీక్షించారు. అయా కార్యక్రమాల్లో డీఎల్‌సీవో కే తిరుపతయ్య, ఎస్‌డీఎల్‌సీవో షేక్ రహమ్‌తుల్లా, శివనాగేశ్వరరావు, జీడీసీసీబీ మేనేజర్ ఖాదర్‌బాషా, సొసైటీ సీఈవో కె.సాంబశివరావు, మల్లికార్జున రెడ్డి, నర్ర పుల్లయ్య, తిరుమలకుమార్, రామకోటయ్య, ఐనాల శ్రీరాములు, తోట వెంకటేశ్వర్లు తదితరులు హాజరయ్యారు.

అన్నదాత సుఖీభవ పథకం రైతులకు వరం

బెల్లంకొండ, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకం రైతులకు వరం లాంటిదని టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్‌షరీఫ్ అన్నారు. శనివారం బెల్లంకొండ టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ.7వేలు లబ్ధిదారుల ఖాతాల్లో జమచేశారన్నారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, టీడీపీ నాయకులు అక్కల వెంకటరామిరెడ్డి, వెన్నా సీతారామిరెడ్డి, గుడిసె కొండయ్య, ఓర్సు ఆనంద్, బెల్లంకొండ సర్పంచ్ జ్యోతి సముద్రం, రసూల్, జానీ, పిచ్చయ్య, అహమ్మద్, రజాక్, సయ్యద్ మాజీద్ తదితరుల పాల్గొన్నారు.

ఏటీఎం కార్డుతో రూ.లక్ష నగదు అపహరణ

రెంటచింతల, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఏటీఎం కార్డు దొంగిలించి విడతల వారీగా రూ.లక్ష నగదును ఏటీఎంల నుంచి డ్రాచేసిన సంఘటన ఇది. ఎస్ఐ సీహెచ్ నాగార్జున కథనం మేరకు... తుమ్మకోట గ్రామానికి చెందిన జానీబాష తన ఏటీఎం కార్డు అపహరణకు గురైనట్లు గుర్తించలేదు. శుక్ర, శనివారాల్లో యూనియన్ బ్యాంక్‌కు వెళ్లి పరిశీలించగా లక్ష డ్రా చేసినట్లు గుర్తించాడు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

అన్నదాతల సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యం

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్


చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

క్రోసూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): అన్నదాతల సంక్షేమం చంద్రబాబు ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. శనివారం క్రోసూరు మార్కెట్‌యార్డులో జరిగిన అన్నదాత సుఖీభవ నియోజకవర్గ స్థాయి ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా 41,045 మంది రైతులకు రూ.28.73కోట్ల చెక్కులు అందజేశారు. నియోజక వర్గంలో గత సంవత్సర కాలంలో రూ 100కోట్ల అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. ఈ సందర్భంగా డ్వాక్రా మహిళల వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్స్‌ను సందర్శించారు. చంద్రబాబు చిత్రపటానికి టీడీపీ నాయకులతో కలసి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెన్నా సాంబశివారెడ్డి, షక్ జానీ, నూర్జహాన్, బేగం, కన్యదార వసంతరావు, దిగుమర్తి అప్పారావు, దూళ్ళ సాంబశివరావు, కాండ్రు కాశయ్య, ఏపూరి నాగేశ్వరరావు, తోక వెంకటరావు, కిలారి రాజన్‌బాబు, నందిగం ఆశీర్వాదం, షేక్ మొగల్ జాన్, గంధం కోటేశ్వరరావు, నలజాల కోటేశ్వరరావు, నలజాల సదాశివరావు, దుద్దుల యోహాన్, మైసూర్ బాబు, మద్దిరాల గంగాధర్, అనుముల వెంకట రామిరెడ్డి, ఏడీఏ మస్తానమ్మ, ఏవో వీ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవతో రైతుల కళ్ళలో ఆనందం

సత్తెనపల్లి రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకం నిధుల విడుదలతో రైతుల కళ్ళల్లో ఆనందం వెల్లి విరిసిందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. నియోజకవర్గ స్థాయి అన్నదాత సుఖీభవ - పిఎం కిసాన్ పథకాన్ని శనివారం వ్యవసాయ మార్కెట్‌యార్డులో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు మేలు చేకూర్చేది కూటమి ప్రభుత్వమన్నారు. ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా ప్రభుత్వం నెరవేరుస్తూ సంక్షేమం అంటే ఏమిటో ప్రజలకు చూపిస్తుందన్నారు. సబ్సిడీపై డ్రిప్స్, రైతు రథాలు, యంత్రాలు, యంత్రపరికరాలు అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. అనంతరం నకరికల్లుకు చెందిన శ్రీ గోపాల కృష్ణ రైతు మిత్ర సంఘం వారికి సబ్సిడీపై డ్రోన్‌ను ఎమ్మెల్యే అందజేశారు.

పొగాకు రైతులను ఆదుకొనేందుకే కొనుగోలు కేంద్రం

పొగాకు రైతులకోసం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేసినట్లు ఎమ్మెల్యే కన్నా అన్నారు. వ్యవసాయ మార్కెట్ యార్డులోని గోదాములో శనివారం నల్లబర్లి పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం కేంద్రానికి వచ్చిన పొగాకు బేళ్ళను ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ కోమటినేని శోభారాణి, మార్క్‌ఫెడ్, మార్కెట్ యార్డు అధికారులు పాల్గొన్నారు.


పొగాకు బేళ్ళను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కన్నా

వేంపకంపల్లి టీడీపీ ఎంపీటీసీ అభ్యర్థిగా కనకదుర్గ


ఎన్నికల అధికారికి బీఫారం అందజేస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

కారంపూడి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేపకంపల్లి ఎంపీటీసీ స్థానానికి ఉప ఎన్నికలకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో టీడీపీ అభ్యర్థిగా బొల్నేడి కనకదుర్గ శ్రీనివాసరావును ఖరారు చేస్తూ ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి శనివారం బీ ఫారం అందించారు. అనంతరం వారితో కలిసి మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల అధికారికి బీఫారం అందజేశారు.

● ముప్పాళ్ళ ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ మారూరి పద్మావతి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో అధికారులు తమ శాఖలలో జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించారు. సమావేశం మొక్కుబడిగా జరిగింది. ఇన్‌చార్జ్ ఎంపీడీవో రూపవతిని వివరణ కోరగా సభ్యులందరికీ సమావేశం గురించి తెలియజేశామన్నారు. పలువురు సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

● క్రోసూరు: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించే ఓపెన్ స్కూల్ విధానం వయోజనులకు వరం అని ఎంఈవో-2 గణేష్ అన్నారు. శనివారం క్రోసూరు హైస్కూల్‌లో జరిగిన ఓపెన్ స్కూల్ ప్రాముఖ్యత, అవగాహన సదస్సులో గణేష్ మాట్లాడారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ సీహెచ్ సురేష్ పాల్గొన్నారు.

● అచ్చంపేట: అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధుల విడుదల పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక డ్రైల్యాండ్ అగ్రి ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో రైతులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీఈవో హరిత, కంపెనీ డైరెక్టర్లు ఆంజనేయులు, సింహరాయులు, కోటేశ్వరి పాల్గొన్నారు.

● మండలంలోని మాదిపాడు, వేల్పూరుల్లో శనివారం తల్లి పాల వారోత్సవాలు నిర్వహించినట్టు అంగన్‌వాడీ సూపర్ వైజర్లు ఎస్ మాణిక్యం, కే పద్మ శనివారం తెలిపారు. కార్యక్రమాల్లో గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

● నకరికల్లు: స్పౌజ్ పింఛన్‌లు మంజూరుచేస్తూ ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని ఎంపీడీవో జీ కాశయ్య తెలిపారు. నకరికల్లు మండలంలో 166 పింఛన్‌లను శనివారం పంపిణీ చేశారు.

● అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ మొదటివిడతలో భాగంగా నకరికల్లు మండలంలో 9,904మంది రైతులకు రూ.6.93కోట్లు ఖాతాల్లో జమైనట్టు ఏవోదేవదాసు తెలిపారు.

● ముప్పాళ్ళ ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనంతలక్ష్మీ అన్నారు. మండలంలోని చాగంటివారిపాలెంలో అంగన్‌వాడీ కేంద్రం లో శనివారంతల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు.

● సత్తెనపల్లి: బిడ్డకు తల్లిపాలు శ్రేష్ఠమని ఏరియా వైద్యశాల గైనకాలజిస్టు డాక్టర్ బీ అరుణ అన్నారు. పట్టణంలోని ఏరియా వైద్యశాలలో శనివారం తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా గర్భిణీలకు, బాలింతలకు తల్లి పాల ప్రాధాన్యత గురించి అవగాహన కల్పించారు.

● ముప్పాళ్ళ: మండలంలో అన్నదాత సుఖీభవకు రైతులకు ఆటంకం లేకుండా చూడాలని ఆర్డీఓ రమణకాంత్‌రెడ్డి అన్నారు. ముప్పాళ్ళ తహసీల్దార్ కార్యాలయాలన్ని ఆర్డీఓ రమణకాంత్‌రెడ్డి శనివారం సందర్శించి తహసీల్దార్ ఎం నగేష్‌ను అన్నదాత సుఖీభవకు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

అమరావతిలో వాహనాల తనిఖీ

అమరావతి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): అమరావతిలోని బస్టాండ్ సమీపంలో పిడుగురాళ్ల మోటారు వాహన తనిఖీ అధికారి పవన్‌కుమార్, పిడుగురాళ్ల ఆర్టీసీ డిపో మేనేజరు కోటేశ్వరరావు నాయక్, ఎస్ఐ అమీర్‌లు శనివారం వాహనాలను తనిఖీ చేశారు. తనిఖీలలో సీటు బెల్ట్, పెండింగ్ చలానాలు, డ్రైవింగ్ లైసెన్స్‌లు పరిశీలించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో శనివారం 40.77 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 1,81,808 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16,600, ఏడుగేట్ల ద్వారా 1,65,069, లీకుల ద్వారా 400, మొత్తం 1,82,069 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

హైర్ బస్సు డ్రైవర్ల ఆందోళన

మాచర్లటౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఆర్టీసీలో చేపట్టబోయే డ్రైవర్ ఉద్యోగాల నియామకాలలో ప్రాధాన్యత కల్పించాలంటూ హైర్ బస్సు డ్రైవర్లు సీఐటీయూ ఆధ్వర్యాన శనివారం ఆందోళన నిర్వహించారు. పట్టణంలోని ఆర్టీసీ డిపో పరిధిలో 25 హైర్ బస్సులు నడుస్తున్నాయి. అందులో 56 మంది డ్రైవర్లు పనిచేస్తున్నారు. డ్రైవర్ల నియామకాల కోసం మాచర్ల డిపో మేనేజర్ వీరాస్వామి దరఖాస్తులు కోరారు. ఎన్నో ఏళ్లుగా ఆర్టీసీలోనే హైర్ బస్ డ్రైవర్లుగా పనిచేస్తున్న తమకు అవకాశం కల్పించాలంటూ డ్రైవర్లు విధులకు గైర్హాజరై సీఐటీయూ నేతల ఆధ్వర్యాన ఆందోళనకు దిగారు. డిపో మేనేజర్ వీరాస్వామి హైర్ బస్సు డ్రైవర్లకు ప్రాధాన్యతనిస్తామని తెలపడంతో వారు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు బండ్ల మహేష్, వేముల వెంకట్రావు, హైర్ బస్ డ్రైవర్ల సంఘం నేతలు మురళీకృష్ణ, నాగరాజు, మణిరెడ్డి, వెంకయ్య, కృష్ణానాయక్ తదితరులు పాల్గొన్నారు.

చల్లగుండ్ల చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం

● గురజాల డీఎస్పీ జగదీష్


విద్యార్థులతో డాక్టర్ చల్లగుండ్ల శ్రీనివాస్, చల్లగుండ్ల శ్రీకాంత్

గురజాలటౌన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): చల్లగుండ్ల చారిటుబల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని గురజాల డీఎస్పీ జగదీష్ అన్నారు. శనివారం పట్టణంలోని చల్లగుండ్ల గార్డెన్స్‌లో ప్రముఖ వైద్యుడు డాక్టర్ చల్లగుండ్ల శ్రీరామమూర్తి ప్రథమ వర్ధంతి సందర్భంగా ట్రస్ట్ ఆధ్వర్యాన ఉచిత కంటిశుక్లాల వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ముందుగా డాక్టర్ శ్రీరామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్ట్ ద్వారా సేవలందిస్తున్న వ్యవస్థాపకుడు డాక్టర్ చల్లగుండ్ల శ్రీనివాస్‌ను అభినందించారు. నియోజకవర్గంలోని పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రభుత్వపాఠశాలల 11మంది విద్యార్థులను సత్కరించి ఒక్కొక్కరికి రూ.10వేల ఆర్థిక ప్రోత్సాహన్ని చల్లగుండ్ల శ్రీనివాస్, శ్రీకాంత్‌లు అందించారు. ఉచిత కంటి శుక్ల వైద్యశిబిరానికి విశేషస్పందన లభించింది. శిబిరంలో శంకరకంటి ఆసుపత్రి వైద్య సిబ్బంది 378మంది రోగులను పరీక్షించారు. పట్టణంలోని ఆనిగ్రేస్ వృద్ధాశ్రమ, గంగవరంలోని అక్షయ వృద్ధాశ్రమంలో అన్నదానం జరిపారు. కార్యక్రమంలో ఎంఈవో ఆకుల సత్యనారాయణ, ట్రస్ట్ సభ్యులు బండారు చిరంజీవి, అరుణ్, అక్కినపల్లి సైదులు, జగదీష్, అమృతం ఆంజనేయులు, రామారావు పాల్గొన్నారు.

అన్నదాత ఇంట ప్రోత్సాహక పంట

● టీడీపీ నేత డాక్టర్ వడ్డెంపూడి


పవన్‌కుమార్(ఫైల్)

రాజుపాలెం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్‌లో ఒకటైన అన్నదాత-సుఖీభవ పథకం హామీ శనివారం నెరవేర్చిందని టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ వడ్డెంపూడి పవన్‌కుమార్ తెలిపారు. రాజుపాలెంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు సీజన్‌లో ఆర్థికసాయం అందించి అండగా నిలిచేందుకు ప్రవేశపెట్టిన అన్నదాత-సుఖీభవ పథకం సొమ్ము అన్నదాతల ఖాతాలోకి జమచేసిందన్నారు. మొత్తం రూ.7వేలు రైతుల బ్యాంకుఖాతాలకు జమవుతుందన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

దివ్యాంగులకు ఇంటి వద్దనే విద్య

పిడుగురాళ్ల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): బడికి రాలేని దివ్యాంగ విద్యార్థులకు ఇంటి వద్దనే చదువు నేర్పించే కార్యక్రమాన్ని శనివారం పల్నాడు జిల్లా ఐఈడీ కో-ఆర్డినేటర్ సెల్వరాజ్ పరిశీలించారు. ప్రభుత్వం దివ్యాంగులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించి ప్రతి నెల రూ.600 భవితసెంటర్ నందు జరిపే ఫిజియోథెరపి, చికిత్స సేవలకు అందించడమే కాకుండా బడికి వెళ్లలేని దివ్యాంగులకు తల్లికి వందనం పథకం అమలు జరిగిందన్నారు. ఇంటి వద్దనే చదువు అందిస్తున్న తీరును జిల్లా కో-ఆర్డినేటర్ సెల్వరాజ్ పరిశీలించారు. స్థానిక భవిత శిక్షణా కేంద్రం రీసోర్స్‌పర్సన్లు అజిత్‌కుమార్, హరికుమార్‌లు పాల్గొన్నారు.

ఆకురాజుపల్లి మేజరు మరమ్మతులకు శ్రీకారం

మాచవరం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని తురకపాలెం, వేమవరం గ్రామాలకు సంబంధించి ఆకురాజుపల్లి మేజరు పరిధిలోని కాలువల మరమ్మతులకు టీడీపీ నాయకులు శనివారం శ్రీకారం చుట్టారు. కాలువల్లో పేరుకుపోయిన పూడిక, జేసీబీ సాయంతో కంపచెట్లు తొలగించేందుకు టీడీపీ నాయకులు శ్రీకారం చుట్టారు. చివరి భూములకు కూడా నీరందించేందుకు ఎన్ఎస్‌పీ అధికారులు మరమ్మతులు చేస్తున్నారు. మండల తెలుగు యువత అధ్యక్షుడు షేక్ హసాన్‌వలి, షేక్ మాబూవలి తెలిపారు.

పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

కారంపూడి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని నేతలు అన్నారు. శనివారం మండలంలోని గాదెవారిపల్లె సచివాలయంలో స్పౌజ్ పింఛన్లను వారు లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో దోర్నాల బ్రహ్మారెడ్డి, విప్పర్ల చిన ఆంజనేయులు, నరసింహారెడ్డి, పెదఆంజనేయులు, పెదశ్రీనివాసరావు, చినశ్రీనివాసరావు, రాంబాబు, వెంకటేశ్వర్లు, పెద్దిరెడ్డి, లక్ష్మయ్య, రామారావు, శ్రీనివాసరావు, జనసేన నాయకులు బొజ్జయ్య, జనార్ధన్, బద్రి, హేమంత్, విశ్వాస్ పాల్గొన్నారు.

సంక్షిప్తం...

● సత్తెనపల్లి రూరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బందిచే రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో పలువురు రేషన్ డీలర్లు, రెవెన్యూ సిబ్బంది రక్తదానం చేశారు.

● పెదకూరపాడు: తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని పాటిబండ్లలో శనివారం ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ ఇమామ్‌బీ మాట్లాడుతూ బిడ్డకు తల్లిపాలు ఎంతో మేలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

● బెల్లంకొండ: తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వనజ పేర్కొన్నారు. శనివారం మండలంలోని న్యూచిట్యాల ఆర్‌అండ్‌ఆర్ సెంటర్‌లో తల్లిపాల వారోత్సవాల్లో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

● కూటమి ప్రభుత్వంలో అర్హులందరికీ పింఛన్‌లను అందిస్తున్నామని టీడీపీ మండల కోర్ కమిటీ సభ్యులు వెన్నా సీతారామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని నాగిరెడ్డిపాలెంలో నూతన పింఛన్‌లు ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ గిరిధర్‌రెడ్డి, తిప్పిరెడ్డి కిచ్చారెడ్డి, బద్దూరి వీరారెడ్డి, చావలి ఎరుకలయ్య, చావలి రామకృష్ణ, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

● రెంటచింతల: తల్లిపాలు బిడ్డకు రక్షని పీహెచ్‌సీ సూపర్‌వైజర్ పీ.లక్ష్మీప్రసన్న అన్నారు. అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం ఆంజనేయస్వామి మాన్యంలో అంగన్‌వాడీల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

● రెండో విడత మండలానికి 25 మినీ గోకులాలు మంజూరైనట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు, ఉపాధిహామీ ఏపీవో వెంకటేశ్వరరావులు చెప్పారు.

● విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకుని తద్వారా సమాజంలో ఉన్నత స్థితికి ఎదగాలని లియోఫోర్స్(హైదరబాద్) మేనేజర్ రాధాకృష్ణ కోరారు. శనివారం రెంటచింతలలోని సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాలలోని టెన్త్ చదివే విద్యార్థులకు ఒక రోజు వృత్తినైపుణ్యాల్లోని మెలకువలు వివరించారు. ఎంఎల్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు.

● బిడ్డల చదువులపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలని ఎప్పటికప్పుడు విద్యార్థుల ప్రగతి పత్రాలను పరిశీలించాలని అంబేద్కర్ కాలని మోడల్ మండల పరిషత్ పాఠశాల హెచ్ఎం లేళ్ల శ్రీనివాసరావు కోరారు. శనివారం విద్యార్థులు తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశంలో టీచర్లు, పేరెంట్స్ పాల్గొన్నారు.

● సత్రశాలలోని కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టును అనంతపురం జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ విద్యార్థులు పరిశీలించారు. ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా శనివారం సందర్శించారు. కార్యక్రమంలో ఈఈ నాగరాజు, మల్లేష్, ఏడీఈ గిరిబాబు, సుబ్బారావు పాల్గొన్నారు.

● గురజాలటౌన్: గురజాల పట్టణంలోని పుట్టబావి సెంటర్లో గల అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్, వైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

● మాచవరం: మండలంలోని అన్ని గ్రామాల్లో కలిపి అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి 8,100 మంది రైతులకు రూ 5.67 కోట్లు మంజూరైనట్టు ఏవో రామమ్మ శనివారం తెలిపారు. అన్నదాత సుఖీభవ మొదటి విడత కింద రూ 5వేలు, పీఎం కిసాన్ 2వ విడత కింద రూ 2వేలు కలిపి రూ 7వేలు ఆయా గ్రామాల రైతుల ఖాతాల్లో జమ చేయటం జరుగుతుందని ఏవో తెలిపారు.

● దాచేపల్లి: ప్రభుత్వ పథకాలతో పేదలు అభివృద్ధి చెందాలని కూటమి నేతలు నెల్లూరి రామకోటయ్య అన్నారు. శనివారం మండలంలోని కేసానుపల్లిలో కొత్తగా మంజూరైన పింఛన్‌లను లబ్ధిదారులకు అందజేశారు. ప్రభుత్వం పేదలు ఆర్థిక, సామాజికంగా అభివృద్ధి చెందాలనేదే లక్ష్యంగా పని చేస్తుందని వివరించారు. ఆయా కార్యక్రమాల్లో కోట శాయన్న, బొల్లా కిట్టారావు, షేక్ జానయ్య, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

● క్రోసూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): తల్లి పాలు బిడ్డకు శ్రేష్ఠమని అంగన్‌వాడీ సూపర్ వైజర్లు వెంకటలక్ష్మి, షైమున్నీసా, రత్నకుమారి అన్నారు. శనివారం క్రోసూరులో తల్లిపాల వారోత్సవ ర్యాలీ నిర్వహించారు. తల్లిపాల వారోత్సవ ర్యాలీ అందుకూరులో కూడా జరిగింది. రెండు కార్యక్రమాల్లో ఎంఈవో - 2 గణేష్, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

● అమరావతి: అన్నదాత సుఖీభవ పథకం ద్వారా మండలంలో 9,233 మంది రైతులకు లబ్ది చేకూరుతుందని ఏవో అహ్మద్ తెలిపారు. తొలివిడతగా శనివారం మండలంలో రూ6.46కోట్లు రైతులఖాతాలో జమచేసిందన్నారు.



గవర్నర్ అబ్దుల్‌నజీర్ నుంచి గౌరవ డాక్టరేట్స్ అందుకుంటున్న ఐల్యాబ్స్ గ్రూప్ ఫౌండర్ చింతలపాటి శ్రీనివాసరాజు, జెన్ టెక్నాలజీస్ మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ అట్లూరి, మ్యూజిక్ గురు, ఇండియన్ ప్లేబాక్ సింగర్ కంపోజర్ డాక్టర్ కొమండూరి రామాచారి తదితరులు

సాంకేతిక నగరంగా అమరావతి

● క్వాంటం టెక్నాలజీకి దిక్సూచిగా ఆంధ్రప్రదేశ్ ● విజ్ఞాన్స్ వర్సిటీ స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్‌నజీర్

గుంటూరు(విద్య), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతి పరిపాలనా నగరంగానే కాకుండా, సాంకేతిక నగరంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని గవర్నర్ అబ్దుల్‌నజీర్ తెలిపారు. వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో శనివారం 13వ స్నాతకోత్సవం జరిగింది. ఈ సందర్భంగా గవర్నర్ ప్రసంగిస్తూ స్మార్ట్ శ్రేణి మౌలిక వసతులు, సుస్థిరత, డిజిటల్ పాలనా కేంద్రంగా అమరావతి మారుతోందన్నారు. క్వాంటం వ్యాలీ ప్రాజెక్టు ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రపంచ క్వాంటం టెక్నాలజీ కేంద్రంగా మారాలన్న దిశగా ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు. సిలికాన్ వ్యాలీ తరహాలో అమరావతిని అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుందన్నారు. అత్యాధునికంగా అమరావతి నిర్మాణానికి విద్యార్థులు, యువతే మూలస్తంభాలన్నారు. ఇంజనీరింగ్ వల్ల వ్యవసాయ రంగానికి డ్రోన్లు, సెన్సార్లు, డేటా ఆధారిత ఫార్మింగ్ సాధ్యమైందన్నారు. ఆరోగ్యరంగంలో డయగ్నొస్టిక్స్ డ్రగ్ డెలివరీలో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. పాలసీ, విద్య, మానసిక శాస్త్రంలో డేటా ఆధారిత నిర్ణయాల ద్వారా స్థిరమైన పరిష్కారాలు సాధ్యమవుతున్నాయన్నారు. హైదరాబాద్‌లోని ఐల్యాబ్స్ గ్రూప్ ఫౌండర్ చింతలపాటి శ్రీనివాసరాజు మాట్లాడుతూ విద్యార్థులందరూ ఏఐ టూల్స్‌పై పట్టు సాధించాలన్నారు. విద్య, ఉద్యోగం, ఆట, పాటల్లో టాపర్లగా నిలవాలన్నా మంచి అలవాట్లు, చక్కని ప్రణాళిక ఎంతో కీలకమన్నారు. జెన్ టెక్నాలజీస్ మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ అట్లూరి ప్రసంగిస్తూ సాంకేతిక పురోగతి నుంచి సామాజిక అసమానత వంటి అనేక గణనీయమైన సవాళ్లను ప్రపంచం ఎదుర్కొంటోందని, దీనిని పరిష్కరించడం యువకుల బాధ్యత అన్నారు. విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ ప్రపంచంలో ప్రస్తుతం సయోధ్యకంటే సంఘర్షణ, సామరస్యత కన్నా విభేదాలు, శాంతి కన్నా కలహాలు కనిపిస్తున్నాయన్నారు. పరిస్థితుల మధ్య మళ్లీ ఒక గాంధీ, ఒక బుద్ధుడు పుడితే ఎంత మంచిదో అనిపిస్తోందన్నారు. మానవత్వాన్ని గుర్తు చేస్తూ, శాంతిని వ్యాప్తిచేస్తూ, మానవాళిని మళ్లీ సద్గతికి నడిపించగల నేతలు కావాలన్నారు. వేదాలు కూడా ఓం శాంతిః శాంతిః శాంతిః అంటూ ప్రారంభమవుతాయని, శాంతే మన అభివృద్ధికి మూలస్తంభమన్నారు. విజ్ఞాన్స్ వైస్ చైర్మన్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ మేకిన్ ఇండియా మాత్రమే కాదు ఇన్వెంట్ ఇన్ ఇండియా, డిజైన్ ఇన్ ఇండియా, లీడ్ ఫ్రమ్ ఇండియా కూడా కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వీసీ ఆచార్య పీ నాగభూషన్, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు, సీఈవో డాక్టర్ కూరపాటి మేఘన, బోర్డుఆఫ్ మేనేజింగ్ సభ్యులు, విభాగాల డీన్లు పాల్గొన్నారు.

అంబరాన్ని అంటిన సంబరం

డిగ్రీలు అందుకున్న విద్యార్థుల ఆనందోత్సాహాలతో స్నాతకోత్సవ సంబరం అంటరాన్ని అంటింది. విద్యార్థుల కేరింతలతో వర్సిటీ ప్రాంగణం హోరెత్తింది. విద్యార్థులంతా తలపాగా, కండువాలతో అచ్చతెలుగు సంప్రదాయ దుస్తులతో వేడుకలో పాల్గొనడం ఆహూతులను ఆకట్టుకుంది. ఐల్యాబ్స్ గ్రూప్ ఫౌండర్ చింతలపాటి శ్రీనివాసరాజు, జెన్ టెక్నాలజీస్ ఎండీ అశోక్ అట్లూరి, మ్యూజిక్ గురు డాక్టర్ కొమండూరి రామాచారిలకు గవర్నర్ గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేశారు. 2122 మంది డిగ్రీలు, 60 మంది విద్యార్థులు బంగారు పతకాలు అందుకున్నారు.



శాశ్వతం.. స్నేహితం

నేడు స్నేహితుల దినోత్సవం

స్నేహం....రెండక్షరాల ఓ చిన్న పదం.. కానీ, ప్రభావం మాత్రం అనంతం. మానవ జీవన గమనంలో ప్రతి దశలోనూ తోడుండి నడిపించే ఇంధనం. మతం, భాష, ప్రాంతీయ భేదాలు లేని మనిషి మూలధనం. తల్లిదండ్రుల తర్వాత వ్యక్తి జీవితాన్ని తీవ్రంగా ప్రభావితం చేసే గొప్ప బంధం. ఓ వ్యక్తి జీవితం సరైన దిశలో సాగినా లేదా అస్తవ్యస్తంగా మారినా దాని వెనక తప్పని సరిగా ఓ స్నేహితుడు ఉంటాడు. మంచైనా చెడైనా మన భవిష్యత్తును ప్రభావితం చేసేది మాత్రం ఈ స్నేహ బంధమే. ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా మారుతున్న స్నేహాలపై ప్రత్యేక కథనం..

❖ కొత్త మార్గాల్లో స్నేహ హస్తాలు..

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

దశాబ్దం క్రితం వరకు ఒక్కొక్కరి స్నేహితుల జాబితా చాలా పెద్దదిగానే ఉండేది. ప్రస్తుతం స్నేహితులెంతమంది ఉన్నారనే ప్రశ్నకు నేటి యువత ఇస్తున్న సమాధానం ఇద్దరి, ముగ్గురి లోపే. అది కూడా ఎక్కువగా కళాశాల స్నేహాలే ఉంటున్నాయి. స్నేహతత్వం మారకపోయినా మనుషుల ఆలోచనల్లో మాత్రం కొంత మార్పు కనబడుతోంది.

బాల్య స్నేహితులేరి..

వృద్ధాప్యంలో బాల్య స్నేహితులను కలిసి నప్పుడు కలిగే మానసిక ఉల్లాసమే వేరు. గడచిన రెండు తరాలుగా ఇలాంటి స్నేహా లు కనిపించడం లేదు. కళాశాల రోజులకు వచ్చేసరికి స్కూల్ ఫ్రెండ్స్ దూరమవు తున్నారు. ఉద్యోగ జీవితంలోకి అడుగుపెట్టేసరికి కళాశాల స్నేహితులు కనిపించడం లేదు. తీరా సంసార జీవితంలోకి అడుగు పెట్టేసరికి అసలు స్నేహితులే లేకుండా పోతున్నారు.



స్నేహం..ప్రేమై.. మళ్లీ స్నేహితులుగా..

యువతీయువకుల మధ్య స్నేహబంధాలు ప్రేమగా కూడా చిగురించడం సాధా రణమే. పలు కారణాల వల్ల బంధం విచ్ఛిన్నమైతే.. మంచి స్నేహితులుగా అడుగులేసే ఆరోగ్యకర పరిణామం ఇటీవల కాలంలో కనబడుతోంది. ఇది మైత్రీ బంధం విలువను మరింత పెంచుతోంది.

ఓదార్చే చేయి లేక.. 50 శాతం ఆత్మహత్యలు

ఇటీవల చిన్నచిన్న విషయాలకే కుంగుబాటుకు గురై బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. వీరిలో అధిక శాతం యువతే ఉండడం మరింత కలవరపరుస్తోంది. ఓ సంస్థ జరిపిన అధ్యయనంలో ఆత్మహత్య ఆలోచన వచ్చినప్పుడు సరైన స్నేహితుడు పక్కన ఉంటే దాని నుంచి బయట పడడం తేలిక అని తేల్చింది. బలవంతంగా ఉసురు తీసుకుంటున్న వారిలో 50 శాతం మరణాలు సాధకబాధకాలు చెప్పుకునే స్నేహబంధం లేకపోవడం వల్లేనని సర్వేలో తేలింది.

❖ తగ్గిన స్నేహితుల సంఖ్య

ఆన్‌లైన్ స్నేహాలు..

ఆన్‌లైన్ స్నేహాలూ ఈ దశాబ్దంలో కొత్తగా పురుడుపోసుకున్నవే. నిజానికి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ స్నేహం ఏదైనా కావొచ్చు దాని విలువ మాత్రం ఎప్పటికీ ప్రత్యేకమే. కానీ, ముక్కూ మొఖం తెలియని వ్యక్తులకు స్నేహం ఎరవేసి తర్వాత ఆర్థిక మోసాలకు పాల్పడుతున్న ఉదంతాలు ఇటీవల కోకొల్ల లుగా వెలుగుచూ స్తున్నాయి. ఇవన్నీ కూడా స్నేహ బంధానికి బీటలు వారేలాగా చేస్తున్నాయి.

యాప్ స్నేహితులు..

స్నేహితులను యాప్‌లలోనే వెతుక్కోవాల్సిన పరిస్థితి ప్రస్తుతం ఏర్పడింది. యువత సమయం సగం సెల్ ఫోన్‌కే సరిపోతోంది. ఇలాంటి వారే టార్గెట్‌గా మిత్రులను సంపాదించుకోండనే ప్రకటనలు.. వస్తున్నాయి. స్నేహం వ్యాపార వస్తువుగా చూసే పయత్నాలు జరుగుతున్నాయి.

ఎమోషనల్‌గా, మోరల్‌గా..

మేం ఇద్దరం బీటెక్ ఫస్ట్ ఇయర్‌లోనే స్నేహితులయ్యాం. ఫైనల్ ఇయర్‌కు వచ్చేసరికి మా మధ్య ఎమోషనల్ బాండింగ్ ఏర్పడింది. ఏ విషయమైనా చర్చించుకుంటాం. భవిష్యత్తులో ఏవైనా హర్డిల్స్ ఎదురైనా ఈ బంధం దన్నుగా ఉంటుందనే నమ్మకం మాకుంది. పెద్దగా స్నేహం నిర్వచనాల గురించి మాకు తెలియదు. ఏదయినా విషయంలో బాధ కలిగినప్పుడు తనతో చెప్పుకుంటే కాస్త రిలీఫ్‌గా ఉంటుంది. మళ్లీ నార్మల్ అవుతాం.

-ఎన్. హిమబిందు, డేటా సైన్స్ ఫైనల్ ఇయర్, బాపట్ల
-కె.లక్ష్మీ చేతన, బీటెక్ ఫైనల్ ఇయర్



మాటిచ్చాం.. అమలు చేశాం

అన్నదాత సుఖీభవ ప్రారంభోత్సవంలో మంత్రి గొట్టిపాటి

వినుకొండ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాలు అలంకారప్రాయం కాకూడదని, రైతులకు అధికారులు ఎప్పటిక ప్పుడు సమాచారం ఇస్తూ సేవలు అందించాలని విద్యుత్ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. స్థాని క మార్కెట్ యార్డు ఆవరణలో శనివారం అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాన్ని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులుతో కలిసి ఆయన ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం ప్రధాని నరేంద్రమోదీ, ప్రకాశం జిల్లా దర్శిలో అన్నదాత సుఖీ భవ కార్యక్రమం ప్రారంభ ఉపన్యాసాన్ని రైతులకు వినిపించారు. అనంతరం మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ 46,87,530 మంది రైతుల ఖాతాల్లో రూ.32వేల కోట్లను ప్రభుత్వం జమ చేసినట్లు తెలిపారు. రైతుకు ఇచ్చిన మాట ప్రకా రం అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం సహకా రంతో విద్యుత్ తయారు చేసుకునే విధంగా ఆంధ్రప్రదేశ్‌లో 20 లక్షల కనెక్షన్లను సోలార్ సిస్టం ద్వారా ఏర్పాటు చేస్తున్నామని మంత్రి గొట్టిపాటి తెలిపారు. సోలార్ యూనిట్ ఏర్పాటుకు బ్యాంకు రుణాలు అందజేస్తున్నా యని, ప్రతి నియోజకవర్గంలో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసి సబ్ స్టేషన్లకు విద్యుత్ అందించడం ద్వారా 9 గంటల యూనిట్‌ను అందజేస్తామన్నారు.



రైతులకు డ్రోన్ పరికరాలను అందజేస్తున్న కూటమి నాయకులు మంత్రి గొట్టిపాటి రవి, చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు తదితరులు

ప్రజల సొమ్ము దోచుకున్న వారికి శిక్ష తప్పదు

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు 23 మంది ఎమ్మెల్యేలు ఉన్నా. అసెంబ్లీకి వెళ్లి.. ప్రజల తరపున వారి సమస్యలను వినిపించామని మంత్రి గొట్టిపాటి చెప్పారు. నేడు జగన్ మోహన్‌రెడ్డి అరాచకాలను ప్రజలు గుర్తించి 11 సీట్లకు పరిమితం చేశా రన్నారు. ప్రజా సమస్య లను దేవాలయం లాంటి అసెంబ్లీలో ఎందుకు ప్రశ్నించడం లేదని ఆయన మండిపడ్డారు. ప్రజల సొమ్మును దోచుకున్నవారికి శిక్ష తప్పదని, ఆధారాలతో వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

సీసీఆర్ ఉంటే.. రెండవ విడత జమ

సీసీఆర్ కార్డు ఉంటే 2వ విడత కూడా రైతులకు నగదు జమ అవుతుందని, ఎవరూ అపోహ చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. సాగర్ నీరు వచ్చిందని, రైతులు సాగుకు సిద్ధంగా ఉండాలని రైతులకు సూచించారు. ఖరీఫ్‌కు అవసరమైన విత్తనాలు, ఎరువులు ఆర్ఎస్‌కేల్లో ఉంచినట్లు చెప్పారు. పొగాకు పంటలను సాగు చేయొద్దని సూచించారు.

రైతులకు మద్దతుగా నిలిచాం..

సీఎం చంద్రబాబునాయుడు రూ.270 కోట్లతో పొగాకు కొనుగోలు చేశారని, కోకో, మ్యాంగో పంటలకు కూడా ప్రత్యేక నిధిని కేటాయించి వారికి మద్దతుగా నిలిచామని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు. ఈ నెల 11న వినుకొండలో హార్టికల్చర్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజవరపు అచ్చెన్నాయుడు, మంత్రి గొట్టిపాటి రవి హాజరవుతారని చెప్పారు. జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, డీఈవో జగ్గారావు, ఏడీఏ హనుమంతరావు, ఏవో కోటయ్య, ఏడీఏ రవికుమార్, ఏవో వరలక్ష్మి, డీహెచ్‌వో ఐ.వెంకట్రావు, వినుకొండ హెచ్‌వో రసూల్‌తో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

పల్నాడులో పెరుగుతున్న రైతుల ఆత్మహత్యలు

హెచ్ఆర్ఎఫ్, ఆర్ఎస్‌వీ నిజనిర్ధారణ

నరసరావుపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలో దశాబ్ద కాలంలో 400 మందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని మానవ హక్కుల వేదిక, రైతు స్వరాజ్య వేదిక వెల్లడించింది. జిల్లాలో రైతులు ఆత్మహత్యలపై సదరు సంస్థలు నిజనిర్ధారణ చేశాయి. బాధిత రైతు కుటుంబాలను కలసి ఆత్మహత్యలకు కారణాలను తెలుసుకున్నాయి. ప్రభుత్వం ఇప్పటి కైనా నిద్రలేచి జీఓ నంబరు 43ని అమలు పరచి, ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను ఆదుకోవాలని హెచ్ఆర్ఎఫ్.. ఆర్ఎస్‌వీ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశాయి. పాల కుల నిర్లక్ష్యం, ప్రకృతి చిన్న చూపు వల్ల కౌలు రైతులకు జరుగు తున్న తీవ్ర అన్యాయం కారణంగానే పల్నాడు జిల్లాలో గతంలో ఎన్నడూ లేనంతగా రైతుల ఆత్మహత్యలు జరుగుతున్నాయని తమ నిజనిర్ధారణలో నిరూపణ అయ్యిందని పేర్కొన్నాయి. చనిపోయిన రైతు కుటుంబాలకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయం అందడం లేదని పేర్కొన్నాయి. జూలై 29, 30 తేదీల్లో పల్నాడు జిల్లా గురజాల డివిజన్‌లోని వెల్దుర్తి, దుర్గి, గురజాల మండలాల్లోని 8 గ్రామాలలో ఆత్మహత్య చేసుకున్న 9 మంది రైతు కుటుంబాలను, గ్రామస్థులను కలిసి రైతుల ఆత్మహత్యలకు గల కారణాలు, ప్రభుత్వ స్పందన గురించి విషయ సేకరణ చేశామని సభ్యులు తెలిపారు. పల్నాడు ప్రాంతంలో మిగిలిన డెల్టా ప్రాంతాల కంటే కౌలు రైతులు తక్కువగా ఉండేవారు కానీ, గత కొన్ని సంవత్సరాలుగా పల్నాడులో కౌలు రైతుల సంఖ్య పెరిగిందని తెలిపారు. కౌలు రేట్లు విపరీతంగా పెరిగిపోయాయని, దాదాపు రూ.25 వేల కౌలు చెల్లించి పత్తి, మిరప, వరి, కందులు సాగు చేసిన రైతులు కొన్ని సార్లు అధిక వర్షాలు, కొన్ని సార్లు అనావృష్టి, చీడ పీడల కారణాలతో తీవ్ర నష్టాలతో అప్పుల వారి వత్తిడిని తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంటున్నారని చెప్పారు. వెల్దుర్తి మండలంలో వెయ్యి అడుగులు దాటితే గాని బోరు నీళ్లు పడడం లేదని, బోర్ల కోసం కొంతమంది రైతులు లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తూ అప్పుల పాలవు తున్నప్పటికీ.. విఫలం అవుతున్నారని చెప్పారు.



ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబంతో మాట్లాడుతున్న హెచ్ఆర్ఎఫ్.. ఆర్ఎస్‌వీ నిజనిర్ధారణ కమిటీ

ఆత్మహత్యలను దాచి పెడుతున్నారు

సమాచార హక్కు చట్టం ద్వారా, నేర పరిశోధన విభాగం వారి లెక్కల ప్రకారం పల్నాడు జిల్లాలో ఈ దశాబ్ద కాలంలో 400 మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారంటే వారు ఎంత సంక్షోభంలో ఉన్నారో అర్థమవుతోందని నిజనిర్ధారణ వేదికలు తేల్చాయి. ఈ నేపథ్యంలో ఆ కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా ఎప్పటికి రావచ్చని అధికారులను తమ బృందం ప్రశ్నిస్తే వారి దగ్గర కూడా ఎటువంటి సమాధానం లేదని వెల్లడించాయి. వాస్తవానికి రాష్ట్రమంతటా ఇదే పరిస్థితి కనబడుతోందని చెప్పాయి. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత 300 మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నట్లు రైతు సంఘాలు, పోలీసుల లెక్కలు చెప్తుంటే ప్రభుత్వం కేవలం 39 మంది రైతులు మాత్రమే ఆత్మహత్య చేసుకున్నట్లు అసెంబ్లీలో చెప్పడం రైతు ఆత్మహత్యలను ఎంత దాచి పెడుతున్నారో అర్థం అవుతుందని ఆశ్చర్యం వ్యక్తం చేశాయి.

గడపతొక్కని త్రిసభ్య కమిటీలు..

ఇక ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను ఆదుకోవడం కోసం తెచ్చిన జీవో 43 అమలు తీరు దారుణంగా ఉందన్నారు. సందర్శించిన 9 బాధిత కుటుంబాల్లో ఒక్క కుటుంబానికి మాత్రమే ఆ జీవో కింద రూ.7లక్షల ఎక్స్ గ్రేసియా అందిందని చెప్పారు. కొన్ని చోట్ల బాధిత కుటుంబాలకు సంవత్సరం దాటినా.. ఎక్స్ గ్రేషియా అందలేదని తెలిపారు. ఏ ఒక్క కుటుంబం దగ్గరికి కూడా డివిజన్ స్థాయి త్రిసభ్య కమిటీ (ఆర్డీవో, డీఎస్పీ, ఏడీఏ) స్వయంగా వెళ్ల లేదని వెల్లడించారు. కనీసం ప్రాథమిక నివేదిక సమర్పించవలసిన మండల స్థాయి త్రిసభ్య కమిటీ (తహసీల్దార్, వ్యవసాయ అధికారి, సబ్ ఇన్‌స్పెక్టర్) కూడా కుటుంబాల దగ్గరికి రాలేదని నిర్ఘాంతపోయే విషయాలను చెప్పారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, గ్రామ రెవెన్యూ అధికారి లాంటి అధికారులు కనీసం కుటుంబ సభ్యులను కూడా కలవకుండా తూతూ మంత్రంగా విచారణ చేసి నివేదికలు పంపారని వివరించారు. ఆత్మహత్య జరిగిన రైతు కుటుంబాలలోని మహిళల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఏ ఒక్క కుటుంబంలో మహిళకు వితంతు పెన్షన్ రావడం లేదన్నారు.

సమగ్ర అధ్యయనం చేయాలి..

ప్రభుత్వం ఇప్పటికైనా నిద్రలేచి చితికిపోయిన రైతు కుటుంబాలను ఆదుకోవాలని వేదికలు డిమాండ్ చేశాయి. బాధిత కుటుంబాలను డివిజనల్ స్థాయి త్రిసభ్య ధ్రువీకరణ కమిటీ ఆలస్యం చేయకుండా సందర్శించి, విచారణ పూర్తి చేసి సత్వరమే పూర్తి స్థాయిలో కుటుంబాలకు ఆర్థిక సహాయం, పునరావాసం కల్పించాలని కోరాయి. అత్యధిక ఆత్మహత్యలు జరుగుతున్న రాయలసీమ, పల్నాడు, ప్రకాశం జిల్లాలలో సమగ్ర అధ్యయనం చేసి.. సమస్యలు ఉన్న రైతుల కోసం ప్రభుత్వం ఒక హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. మండాడి, రచ్చమల్లపాడు, శ్రీరాంపురం తండా, ముట్లుకూరు, మాడుగుల, పులిపాడు, తేలకుట్ల గ్రామాల్లో పర్యటించిన వారిలో ఆర్ఎస్వీ రాష్ట్ర కన్వీనర్ టీ బాలు, రాష్ట్ర కమిటీ సభ్యుడు బీ కొండలు, మానవహక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, వై రాజేష్, కార్యవర్గ సభ్యులు కే అనురాధ, మానవ హక్కుల వేదిక సమన్వయకర్త వీఎస్‌కృష్ణ ఉన్నారు.

రైతుల సంక్షేమం కోరే..

కూటమి ప్రభుత్వం

● 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ● మంత్రులు కొలుసు, అనగాని

రేపల్లె, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): అన్నదాతతోనే దేశ ప్రగతి సాధ్యమని నమ్మిన పార్టీ టీడీపీ అని, అందుకే ఆ పార్టీ జెండాలోనే నాగలి గుర్తు ఉంటుందని జిల్లా ఇన్‌చార్జ్, రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. శనివారం రేపల్లె మార్కెట్ యార్డులో అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకాన్ని మంత్రులు అనగాని, కొలుసు పార్థసారథి, బాపట్ల ఎంపీ కృష్ణప్రసాద్, జిల్లా కలెక్టర్ వెంకటమురళి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 46,85,838 మంది రైతులకు లబ్ధి చేకూరనుందని, ఇప్పటికే ఈ పథకం కోసం 2342 కోట్లు విడుదల చేశామని తెలిపారు. ఎవరికైన సందేహం ఉంటే 155251 కాల్ సెంటర్ నంబరుకు ఫోన్‌చేసి పరిష్కరించుకోవచ్చన్నారు. 90 శాతం సబ్సిడితో డ్రిప్, అలాగే యంత్ర పరికరాలు, రైతురథాలను రాయితీపై ఇచ్చామని చెప్పారు. గతప్రభుత్వం వీటన్నింటిని రద్దుచేసిందని రైతులను నట్టేటముంచిందని మంత్రి మండిపడ్డారు. రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ రైతులకు పెట్టుబడిసహాయం కింద రూ.12,500లు ఇస్తామని చెప్పిన గత ప్రభుత్వం కేవలం రూ.7,500లు మాత్రమే ఇచ్చిందన్నారు. జగన్ ప్రభుత్వంలో ధాన్యం డబ్బుల కోసం రైతులు రోడ్డెక్కి ఉద్యమాలు చేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. కూటమిప్రభుత్వం 48 గంటల్లోనే ధాన్యం డబ్బులు చెల్లించి రైతులకు అండగా నిలిచిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం బకాయి పెట్టిన రూ.1,674కోట్లను ప్రస్తుత ప్రభుత్వం చెల్లించిందన్నారు. రాష్ట్ర చరిత్రలోనే 18 ఏళ్ల తర్వాత మొదటిసారి ప్రాజెక్టులన్నీ జూలై నాటికే నిండిపోయాయని తెలిపారు. కౌలురైతుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ రూ.3,826 కోట్లను మంజూరుచేశామన్నారు. రేపల్లె నియోజకవర్గంలో 28 వేల మంది రైతులకు రూ.15 కోట్లు అన్నదాత సుఖీభవ పథకం కింద అందిస్తున్నామన్నారు. బాపట్ల ఎంపి కృష్ణప్రసాద్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతులను నట్టేట ముంచారని, కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం పనిచేస్తుందన్నారు. జిల్లా కలెక్టర్ వెంకటమురళి మాట్లాడుతూ రైతులకు అండగా నిలిచేందుకు అన్నదాత సుఖీభవ-పీఎంకిసాన్ పథకం సద్వినియోగపడుతుందన్నారు. అనంతరం రైతులకు అన్నదాతసుఖీభవ-పీఎంకిసాన్ పథకం చెక్కును మంత్రులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య, ఆర్డీఓ రామలక్ష్మీ, కృష్ణాపశ్చిమడెల్టా ప్రాజెక్టు కమిటీ చైరన్ పంతాని మురళీధరరావు, రాష్ట్రకార్యదర్శి గూడపాటిశ్రీనివాసరావు, మార్కెట్‌యార్డు చైర్మన్‌లు తదితరులు పాల్గొన్నారు.




సభలో మాట్లాడుతున్న మంత్రి కొలుసు పార్థసారథి

త్వరలో జీజీహెచ్‌లో

కాలేయ మార్పిడి శస్త్ర చికిత్సలు

● రూ.30 లక్షల విలువైన సర్జరీలు ఉచితంగా.. ● సూపరింటెండెంట్ రమణ యశస్వి

గుంటూరు మెడికల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో త్వరలో కాలేయ మార్పిడి శస్త్ర చికిత్సలను ప్రారంభిస్తున్నట్లు సూపరింటెండెంట్, శరీర అవయవ దాతల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రమణ యశస్వి తెలిపారు. జాతీయ అవయవ దాన దినోత్సవం పురస్కరిం చుకొని శనివారం వైద్య కళాశాల అనాటమీ విభాగంలో ఎంబీబీఎస్ విద్యార్థులకు అవయవ దానంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారి అధ్యక్షత వహించారు. ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో కాలేయ మార్పిడి శస్త్రచికిత్సల నిర్వహ ణకు ఇప్పటికే ఏపీ జీవన్ దాన్ ట్రస్ట్ నుంచి అనుమతులు లభించినట్లు డాక్టర్ రమణ యశస్వి తెలిపారు. తొలి విడతలో కేవలం కేడావర్ లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జరీలు మాత్రమే జరు గుతా యని ఆయన వివరించారు. బ్రెయిన్ డెడ్ అయిన రోగుల నుంచి సేకరించిన కాలేయాన్ని మా త్రమే ప్రస్తుతం రోగులకు మార్పిడి చేస్తామని ఆయన తెలిపారు. అనంతరం జీవించి ఉన్న వ్యక్తుల నుంచి సేకరించిన కాలేయ మార్పిడి ఆపరేషన్లు కూడా నిర్వహిస్తామన్నారు. సుమారు రూ.30 లక్షల విలువైన కాలేయ మార్పిడి ఆపరేషన్లు గుంటూరు జీజీహెచ్‌లో ఉచితంగా నిర్వహిస్తామని, రోగులపై ఒక్క రూపాయి భారం కూడా ఉండ దని డాక్టర్ రమణ యశస్వి వెల్లడించారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ లివర్ స్టడీస్, గ్లెనాగికల్ హాస్పిటల్ (చెన్నై)కు చెందిన లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జన్ డాక్టర్ రజనీకాంత్ పచ్చ మాట్లాడుతూ గుంటూరు జీజీహెచ్‌లో కాలేయ మార్పిడి ఆపరేషన్ల నిర్వహణకు తాము ఒప్పందం కుదుర్చు కున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఆపరేషన్ థియేటర్ల నిర్మాణం, వైద్య సిబ్బందికి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ కోఆర్డినేటర్లకు కూడా ఏర్పాటు చేసినట్లు తెలి పారు. కాలేయ మార్పిడి అవసరమైన రోగులు తమ పేర్లను జీజీహెచ్‌లో నమోదు చేసుకుం టున్నట్లు డాక్టర్ రజనీకాంత్ తెలిపారు. మరో రెండు నెలల్లో లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జరీలను గుంటూరులో ప్రారంభిస్తామని ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో గ్యాస్ట్రోఎంటిరాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎ.కవిత, అనాటమీ విభాగాధిపతి డాక్టర్ మాధవి తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న సుందరాచారి, వేదికపై రమణ, రజనీకాంత్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వినుకొండటౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సిద్ధార్థనగర్, కొత్తపేట, విద్యానగర్, బాలమ్మ బజారు, సురేష్‌మహల్ రోడ్డు, నరసరావుపేట రోడ్డు, శివయ్యస్థూపం సెంటర్ చుట్టుపక్కల విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని ఏఈ పిచ్చయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేషన్ షాపుల్లో ఆకస్మిక తనిఖీలు

బొల్లాపల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి, తహసీల్దార్లు, పౌర సరఫరాల ఉప తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు బృందాలుగా ఏర్పడి ఈనెల 1వ తేదీ నుంచి 2వ తేదీ లోపు పలు రేషన్ షాపులు, వినుకొండలోని రైస్ మిల్లులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగా మండలంలోని రేమిడిచర్ల లో షాపు నెంబరు 38పై దాడి చేసి 6(ఏ) కేసు నమోదు చేశారన్నారు.

● నూజెండ్ల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : నూజెండ్ల, గుర్రపునాయుడుపాలెం, వీ అప్పాపురం, మారెళ్ళవారిపాలెం రేషన్ షాపులను రెవెన్యూ అధికారులు శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జీ రమేష్‌కుమార్ మాట్లాడుతూ రేషన్ షాపుల నిర్వాహకులు బాధ్యతాయుతంగా పని చేయాలని, లబ్ధిదారులకు అందుబాటులో ఉండి బియ్యం పంపిణీ చేయాలన్నారు. ఆర్ఐ ఎస్‌కే సిద్దయ్య, వీఆర్వో నాసర్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

● ఈపూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రత్యేక బృందాలు శనివారం రేషన్ దుకాణాల్లో ఆకస్మిక దాడులు చేసి తనిఖీలు జరిపారు. ఈపూరు షాప్ నెంబర్ 11, కొండ్రముట్ల షాప్ నెంబర్-8, బోడేపూడి వారి పాలెం షాప్ నెంబర్-3 లలో తనిఖీలు చేశారు. ఈపూరు షాప్ నెంబర్- 11లో 7 క్వింటాల రేషన్ బియ్యం తేడాను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ప్రత్యేక బృందాల్లో తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, న్యూ ఇన్‌స్పెక్టర్, వీఆర్వోలు ఉన్నారు.

13 సొసైటీలకు ప్రత్యేక అధికారుల పాలన

● ఆరు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు

నరసరావుపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 13 సహకార సంఘాలకు ప్రత్యేక అధికారుల పాలన కొనసాగనుంది. జనవరి 30 వరకు ఆరు నెలల పాటు అధికారులు పాలన ఉంటుందని ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. జిల్లాలో 60 సొసైటీలు ఉండగా 47 సంఘాలకు త్రిసభ్య కమిటీలను ప్రభుత్వం నామినేట్ చేసిన విషయం తెలిసిందే. 13 సొసైటీకు సకాలంలో త్రి సభ్య కమిటీలకు పేర్లు ప్రతిపాదించకపోవడం వల్లనే అధికారుల పాలనను ప్రభుత్వం కొనసాగిస్తోందని సంబంధితులు చెబుతున్నారు. ధూళిపాళ్ల, ముప్పాళ్ల, మాదల, నందిరాజుపాలెం, నకరికల్లు, మాచవరం, పెద అగ్రహారం, వీరాపురం, రెంటచింతల, మాచర్ల, యడ్లపాడు, మర్రిపాలెం, దుర్గి సొసైటీలకు ప్రత్యేక అధికారుల పాలన కొనసాగనుంది. గతంలో నియమించబడిన అధికారులనే కొనసాగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్‌కు దరఖాస్తుల ఆహ్వానం

వినుకొండటౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): వినుకొండ పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు, ఉద్యోగులు, చేతిపని చేసుకుంటూ చదువుకోవడానికి ఓపెన్ స్కూలు ద్వారా 10, ఇంటర్ చదువుకునేందుకు ప్రభుత్వం వీలు కల్పిస్తున్నట్లు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 సంవత్సరాలు నిండిన వారు 10వ తరగతి చదువుకోవచ్చని, 10వ తరగతి పాసై ఇంటర్మీడియట్ కూడా కొనసాగించవచ్చన్నారు. ఆసక్తి కలిగిన వారు వినుకొండ జూనియర్ కళాశాలలో ఈ నెల 15వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు 9490006556ను సంప్రదించాలన్నారు.

దళితులకు శ్మశానవాటికలు లేకపోవడం దురదృష్టకరం

● మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గోదా జాన్‌పాల్

శావల్యాపురం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా దళితులకు కొన్ని గ్రామాల్లో శ్మశానవాటికలు కూడా లేకపోవడం దురదృష్టకరమని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గోదా జాన్‌పాల్ అన్నారు. మండలంలోని కనమర్లపూడిలో మండల కమిటీ సభ్యులతో శనివారం సమావేశాన్ని నిర్వహించారు. జాన్‌పాల్ మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు స్పందించి మండలంలో అన్యాక్రాంతమైన భూములు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకోవాలని, వాటిలో 2ఎకరాలు దళితుల శ్మశాన వాటికలకు కేటాయించాలన్నారు. మాలమహానాడు తరపున జిల్లాలో శ్మశానవాటికలు లేని గ్రామాలను గుర్తించి జిల్లా కేంద్రంలో దళితులతో పెద్ద కార్యాచరణను రూపొందించనున్నామన్నారు. మాల మహానాడు నియోజకవర్గ అధ్యక్షుడు కీర్తిపాటి వెంకటేశ్వర్లు, గౌరవాధ్యక్షులు ఇజ్రాయెల్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే కూటమి ధ్యేయం

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

● రైతుల ఖాతాల్లో రూ.14.30 కోట్ల నిధులు జమ



రైతులకు అన్నదాత సుఖీభవ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు

నరసరావుపేట రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. నరసరావుపేట మండలం ఇస్సపాలెంలో శనివారం రైతులకు ఎమ్మెల్యే అన్నదాత సుఖీభవ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు బాగుంటేనే అన్ని వర్గాల ప్రజలు బాగుంటారని అన్నారు. ముందుగా రైతులకు నరసరావుపేట నియోజకవర్గంలో విడుదలైన రూ.14.30 కోట్ల చెక్కును పంపిణీ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో అమలవుతున్న ఈ పథకాల ద్వారా ఒక్కో రైతుకు రూ.7వేలు నగదు జమ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ మొత్తంలో పీఎం కిసాన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం రూ.2వేలు, అన్నదాత సుఖీభవ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.5వేలు అందిస్తోందన్నారు. ఈ నిధులు రైతులు ఖరీఫ్, రబీ పంటల సాగు కోసం విత్తనాలు, ఎరువులు, పంటల సంరక్షణ ఖర్చులు మొదలైన వాటికి ఉపయోగపడతాయని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమం కోసం అనేక చర్యలు తీసుకుంటున్నాయని అన్నారు. నియోజకవర్గంలో ఈ పథకం కింద 20,425 మంది రైతులు లబ్ధిపొందినట్లు తెలిపారు. కార్యక్రమంలో కూటమి శ్రేణులు, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

మండలంలోని పెద్ద తురకపాలెంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల తో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే అరవింద బాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ గ్రామీణాభివృద్ధి కోసం ఎన్ఆర్‌ఈజీఎస్ నిధులను సద్విని యోగం చేస్తున్నామని, ఈ సీసీ రోడ్డు నిర్మాణంతో పెద్ద తురకపాలెం గ్రామ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు, సొసైటీ పదవులకు 38 మంది ఖరారు

చిలకలూరిపేట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మార్కెట్ యార్డు, సొసైటీ పదవుల భర్తీతో నియోజకవర్గంలోని టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. చిలకలూరిపేట మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్ల పదవులకు మొత్తం 17 మందిని, 7 సొసైటీల చైర్మన్, సభ్యుల పదవులకు మొత్తం 21 మందిని గుర్తించి, ఆ పేర్లను పార్టీ నేతలతో చర్చించి స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పేర్లు ఖరారు చేశారు. యార్డు చైర్మన్‌గా షేక్ కరీముల్లా, వైస్ చైర్మన్‌గా పిల్లి కోటి పేర్లు ఇప్పటికే ఖరారయ్యాయి. యార్డు కమిటీ జీవో వెలువడనున్నది. కాగా చిలకలూరిపేట నియోజకవర్గం పరిధిలో మొత్తం 7 సొసైటీలు ఉండగా కొమరవల్లిపాడు, గణపవరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్‌లు ఆదివారం పదవీ బాధ్యతలు స్వీకరిస్తారు. స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఈ కార్యక్రమాల్లో ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. కొమరవల్లిపాడు సొసైటీ చైర్మన్‌గా కోడె హనుమంతరావు, సభ్యులుగా మునీర్ హసన్, గొట్టిపాడు బాబు స్థానిక కొత్త మార్కెట్ యార్డ్‌లో కేటాయించిన సొసైటీ కార్యాలయం వద్ద పదవీ స్వీకారం చేస్తారు. గణపవరం సొసైటీ చైర్మన్‌గా నియమితులైన పెంట్యాల శేషయ్య, సభ్యులుగా యామిని ధర్మారావు, పీ హనుమంతరావు గణపవరంలోని సొసైటీ కార్యాలయం వద్ద పదవీ స్వీకారం చేస్తారు. నాదెండ్ల సొసైటీ చైర్మన్‌గా నల్లమోతు హరిబాబు, సభ్యులుగా బత్తుల లక్ష్మారెడ్డి, చాట్ల చెంచు ఆంజనేయులు ఇప్పటికే బాధ్యతలు స్వీకరించారు. కాగా మురికిపూడి సొసైటీ చైర్మన్‌గా చిగురుపాటి రాజబాబు, సభ్యులుగా తమ్మిశెట్టి నాగేశ్వరరావు, గుత్తికొండ సాంబశివరావు నియమితులయ్యారు. సందెపూడి సొసైటీ చైర్మన్‌గా మద్దినేని వెంకట సుబ్బారావు, సభ్యులుగా ధూళిపాళ్ల సూర్యనారాయణ, యనగందుల వీరాంజనేయులు నియమితులయ్యారు. ఉన్నవ సొసైటీ చైర్మన్‌గా కుర్రా రత్తయ్య, సభ్యులుగా గల్లా లక్ష్మీనారాయణ, షేక్ షరీఫ్ పేర్లు ఖరారు అయ్యాయి. సొలస సొసైటీ చైర్మన్‌గా మూలే పిచ్చిరెడ్డి, సభ్యులుగా చింతలపూడి సాంబయ్య, కురగాని పెద్ద వెంకటేశ్వర్లు పేర్లు ఖరారయ్యాయి.

పీఎన్‌సీ అండ్ కేఆర్ ఎన్‌సీసీ క్యాడెట్లకు బీ సర్టిఫికెట్లు ప్రదానం



ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు బీ సర్టిఫికెట్‌లు ప్రదానం చేసిన హవల్దార్‌లు, ప్రిన్సిపాల్, జాయింట్ సెక్రటరీ తదితరులు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పీఎన్‌సీ అండ్ కేఆర్ కళాశాలలో ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు బీ సర్టిఫికెట్‌లు శనివారం ప్రదానం చేశారు. చీరాలలో నిర్వహించిన ఎన్‌సీసీ బీ సర్టిఫికెట్ ఎగ్జామ్స్‌లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ మేజర్ జీ వెంకటేశ్వరరావు అన్నారు. హవల్దార్‌లు వెంకటేశకుమార్, వీరేష్‌లు పాల్గొని క్యాడెట్స్‌కు ధృవపత్రాలను అందించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కళాశాల కోశాధికారి ఎం అన్నపూర్ణమ్మ, జయింట్ సెక్రటరీ పాలడగు శ్రీనివాసప్రసాదు, క్యాడెట్స్‌కు సర్టిఫికెట్‌లు అందజేశారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఎం ప్రేమ్‌చంద్, ఎన్‌సీసీ ఆఫీసర్ వై రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ రాధాకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు రాష్ట్రస్థాయి ఫ్లోర్‌బాల్ పోటీలు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక కే-రిడ్జి ఇంటర్ నేషనల్ స్కూల్లో ఆదివారం రాష్ట్ర స్థాయి ఫ్లోర్‌బాల్ అండర్-14, అండర్-19 బాల బాలికల పోటీలు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ జీ బర్నబాస్ శనివారం తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 16 జిల్లాల నుంచి 250 మంది క్రీడాకారులు పాల్గొంటారన్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనపరచిన క్రీడాకారులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టుకు ఎంపిక చేస్తారన్నారు. సెప్టెంబరు 4, 5, 6, 7 తేదీల్లో బీహార్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు.

అందమైన చేతిరాతతోనే ఉత్తమ ఫలితాలు

● ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత రామమోహన్‌రావు

శావల్యాపురం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అందమైన చేతిరాతతో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించగలుగుతారని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత రామమోహన్‌రావు అన్నారు. బెజవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శావల్యాపురంలోని హైస్కూల్ ప్లస్‌లో విద్యార్థులకు చేతిరాతపై 2రోజుల శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. రామమోహన్‌రావు మాట్లాడుతూ చేతిరాతలో శిక్షణనిచ్చేందుకు శావల్యాపురం హైస్కూల్‌ప్లస్‌లో 100 మంది విద్యార్థులను ఎంపిక చేశామన్నారు. ప్రకాశం, గుంటూరు, నెల్లూరు, కర్నూలు, కుప్పంలో 65వేల మంది విద్యార్థులు, 5300 మంది టీచర్లకు చేతిరాతపై శిక్షణనిచ్చామన్నారు. అనంతరం రామమోహన్‌రావు, సహాయకులు గుడిపూడి సత్యనారాయణ, శ్రీనివాసరావు, రమేష్‌లను ఎంఈవో లలితాకుమారి, హెచ్‌ఎం విజయలక్ష్మి, స్టాఫ్‌సెక్రటరీ, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.

ఆధునిక ఔషధ శాస్త్రంలో ఏఐకి ప్రాధాన్యం

నరసరావుపేటటౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఆధునిక ఔషధ శాస్త్రంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎంతో ప్రాధాన్యం కలిగి ఉందని యూఏఈ గ్లోబల్ హెల్త్ రీసెర్చ్ కేంద్రం అజ్మాన్ యూనివర్సిటీ రీసెర్చ్ ప్రొఫెసర్ గౌరవ్ గుప్తా అన్నారు. శనివారం స్థానిక ఏఎం రెడ్డి ఫార్మసీ కళాశాలలో ఫామ్ పిల్స్ టూ పిక్‌సెల్స్ అండర్ స్టాండింగ్ ఏఐ రోల్ ఇన్ మోడరన్ ఫార్మసీ అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా గౌరవ్‌గుప్తా మాట్లాడుతూ ఏఐ పరిశోధనలు, ఔషధ తయారీ, వ్యాధి నిర్ధారణ తదితర రంగాల్లో వినియోగిస్తున్నారని అన్నారు. కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతమే లక్ష్యంగా గ్రామకమిటీ ఎన్నికలు

● వైసీపీ మండలాధ్యక్షుడు వెంకటేశ్వర్లు

శావల్యాపురం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆదేశాల మేరకు గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా నూతనంగా గ్రామకమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు వైసీపీ మండలాధ్యక్షుడు బోడెపూడి వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని కనమర్లపూడి, కొత్తలూరు గ్రామాల్లో నూతన కమిటీల ఎన్నికలను శుక్రవారం రాత్రి నిర్వహించారు. కనమర్లపూడి వైసీపీ అధ్యక్షుడిగా బోడెపూడి శ్రీనివాసరావును, కొత్తలూరు వైసీపీ అధ్యక్షుడిగా మామిళ్ళపల్లి వెంకటేశ్వర్లును కార్యకర్తలంతా కలసి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

జాతీయ రహదారుల అభివృద్ధికి గడ్కరీ ప్రకటన

● సీఎం విజ్ఞప్తి మేరకు రూ.4605 కోట్ల మంజూరు

గుంటూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రోడ్డు రవాణ జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ జిల్లా పర్యటన సందర్భంగా గుంటూరుకు రెండు భారీ ప్రాజెక్టులను ప్రకటించారు. శనివారం సాయంత్రం మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన సమీక్షలో సీఎం చంద్రబాబు విజ్ఞప్తి మేరకు అప్పటికప్పుడు జాతీయ రహదారుల అభివృద్ధికి నిధులను వేదికపైనే మంజూరు చేశారు. వినుకొండ - గుంటూరు జాతీయ రహదారిని నాలుగు వరుసలుగా అభివృద్ధి చేసేందుకు రూ.2,605 కోట్లను మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. అలానే గుంటూరు - నిజాంపట్నం జాతీయ రహదారిని రూ. 2 వేల కోట్లతో నాలుగు వరసలుగా అభివృద్ధి చేసేందుకు సమ్మతించారు. దీంతో కేంద్ర మంత్రి పర్యటన జిల్లాకు దాదాపుగా రూ. 4605 కోట్ల మేరకు లబ్ధి జరిగినట్లు అయింది. ఈ రెండు జాతీయ రహదారుల నిర్మాణం జరిగితే జిల్లాకు వివిధ ప్రాంతాల నుంచి కనెక్టివిటీ పెరుగుతుంది. అలానే వాణిజ్యపరంగా అభివృద్ధి చెందడానికి అవకాశాలు పుష్కలంగా ఉంటాయి.


ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడిగా బందెల

యడ్లపాడు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడిగా బందెల శ్రీనివాసరావు నియమితులయ్యారు. బీజేపీ నియోజకవర్గ సమన్వయకర్త టి.జయరామిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడిగా నియమిస్తూ జయరామిరెడ్డి నియామకపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తులాబందుల సత్యన్నారాయణ, జిల్లా ఉపా ధ్యక్షుడు మల్లెల శివ నాగేశ్వరరావు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

స్కౌట్స్, గైడ్స్ విద్యార్థులు నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవాలి : ప్రిన్సిపాల్ నీరజ్

నాదెండ్ల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): స్కౌట్స్, గైడ్స్ విద్యార్థులు తమ నైపుణ్యాన్ని పెంపొందించుకుంటే భవిష్యత్ బాగుంటుందని కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ నీరజ్‌కుమార్ శ్రీ వాస్తవ అన్నారు. ఇర్లపాడు గ్రామపరిధిలోని కేంద్రీయ విద్యాలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న తృతీయ సోపాన్ పరీక్షా శిబిరం 2025 కార్యక్రమం రెండో రోజు జరిగింది. ఈ సందర్భంగా స్కౌట్స్ మార్గదర్శకాల్లో భాగంగా వంతెనలు, స్టాండ్‌ల వంటి నిర్మాణాలు సృజనాత్మకంగా ప్రోత్సహించటం, స్కౌటింగ్ జీవితంలో ప్రాముఖ్యత తదితర విషయాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ తృతీయ సోపాన్ తరువాత రాజపురస్కార్ పరీక్షలను ఎదుర్కోవాల్సి ఉంటుందని వివరించారు. ఆ పరీక్షల్లో ఎంపికైన విద్యార్థులకు ప్రెసిడెంట్ అవార్డు దక్కుతాయన్నారు. ఈ సందర్భంగా కేంద్రీయ విద్యాలయం నుంచి కనపర్రు వరకు హైకింగ్ (పాదయాత్ర)ను నిర్వహించారు. కార్యక్రమంలో క్యాంపు క్వార్టర్ మాస్టర్ అధికారి ఎస్ విజయకుమార్, ఎల్‌వోసీ రమేష్‌కుమార్, శ్రీరామ్ కోటి, రవీందర్, ఎస్కార్ట్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్ఈసీలో విద్యార్థుల విజ్ఞాన విహారయాత్ర



నాగార్జునసాగర్ విద్యుత్ ప్లాంట్‌లో కళాశాల విద్యార్థులు

నరసరావుపేట రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థులకు విజ్ఞాన విహారయాత్రలో భాగంగా నాగార్జునసాగర్ కుడి కాలువ పవర్ ప్రాజెక్టును విద్యార్థులు శనివారం సందర్శించారు. నీటిని వినియోగించి విద్యుత్తు తయారు చేయు విధానంపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, కరస్పాండెంట్ మిట్టపల్లి రమేష్‌బాబు, కళాశాల వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

మహాత్మాగాంధీ విగ్రహం ఏర్పాటుకు అనుమతి

వినుకొండటౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఫ్యాన్సీ సెంటర్ ముఖద్వారం వద్ద జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహం ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘ ప్రముఖులు శనివారం తెలిపారు. స్థానిక ఆర్యవైశ్య సంఘం కార్యాలయంలో సదావర్తిసంఘం, వాసవీక్లబ్, ఆర్యవైశ్య సంఘం పెద్దలు సమావేశమై త్వరలో విగ్రహం ఏర్పాటు అంశాల గురించి చర్చించారు. గతంలో వాసవీ క్లబ్ అనుమతితో రోడ్డు విస్తరణలో భాగంగా మండల కేంద్రం వద్ద ఉన్న గాంధీజీ విగ్రహాన్ని తొలగించి ఫ్యాన్సీ సెంటర్ ప్రారంభంలో ఏర్పాటుకు మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్ర బోస్ అనుమతి ఇవ్వడంపై ఆర్యవైశ్య సంఘం పెద్దలు సంతోషం వ్యక్తం చేశారు.

చేసిన పనులను చెప్పుకోక పోవటం వైఫల్యమే

ఎమ్మెల్యే ప్రత్తిపాటి



కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పుల్లారావు

నాదెండ్ల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కూటమి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం గురించి చెప్పుకోకపోవటం మన వైఫల్యమే అవుతుందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మండలంలోని సంక్రాంతిపాడు, గొరిజవోలు గ్రామాల్లో సుపరిపాలన-తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ గ్రామాల్లో పర్యటించిన పుల్లారావు నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో అభివృద్ధి పనులు చేసినా ఓడిపోయామన్నారు. చేసిన అభివృద్ధిని చెప్పినప్పుడే వైసీపీ సానుభూతిపరులు కూడా మన ప్రభుత్వానికి మద్దతు ఇస్తారని అన్నారు. ఈ సందర్భంగా జడ్పీ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరీముల్లా, ఎంపీడీవో స్వరూపరాణి, సమన్వయకర్త సదాశివరావు, వైస్ చైర్మన్ పిల్లి కోటి, నాయకులు బీ సత్యనారాయణ, ఎం సాంబశివరావు, ఎం పోతురాజు, ఎస్ హరిబాబు, గుర్రం స్వాములు, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతసుఖీభవ కింద రూ.15.13కోట్లు

చిలకలూరిపేట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని 21,614 మంది రైతులకు అన్నదాత సుఖీభవ కింద రూ.15.13 కోట్లు అందించినట్లు ఎమ్మెల్యే పుల్లారావు శనివారం తెలిపారు. ప్రతి నెలా నియోజకవర్గంలో రూ.10 కోట్లు సామాజిక పింఛన్లుగా పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఈనెల 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ పథకం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.


మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ ప్రసూన

నరసరావుపేటలీగల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారు లింగంగుంట్లలోని ప్రభుత్వ వైద్యశాలలో శనివారం మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీసీహెచ్ఎస్ డాక్టర్ ప్రసూన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగానికి అలవాటుపడిన యువతను సరైన మార్గంలోకి తేవడానికి ఇతర శాఖలతో పాటు వైద్య ఆరోగ్యశాఖ కూడా తనవంతు పాత్ర నిర్వహిస్తుందన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వ వైద్యశాలలో 20 పడకలతో రెండు నెలల క్రితం డీ ఎడిక్షన్ ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. పట్టణంలో స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మరో డీ అడిక్షన్ సెంటర్ కూడా నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. సదరు కేంద్రాన్ని 15 రోజులకు ఒకసారి తమ వైద్యశాలకు చెందిన ఇద్దరు మానసిక వైద్యులు సందర్శిస్తారన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంవో ఏడుకొండలు, డీసీహెచ్ఎస్ కార్యాలయ సీపీవో మాల్యాద్రి, వైద్య నిపుణులు తదితరులు పాల్గొన్నారు.

సబ్ జైలు పర్యవేక్షణ అధికారిగా సురభి అంజయ్య



అంజయ్య

నరసరావుపేట లీగల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): నరసరావుపేట ప్రత్యేక శ్రేణి ఉపకారాగార పర్యవేక్షణ అధికారి గా సురభి అంజయ్య బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఆయన నెల్లూరు ట్రైనింగ్ అకాడమీలో సేవలందించారు. ఇటీవల జరిగిన బదిలీలో భాగంగా ఆయన నరసరావుపేట సబ్ జైలు పర్యవేక్షణ అధికారిగా బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ సబ్‌జైలు పర్యవేక్షణ అధికారిగా సేవలు అందించిన రవికుమార్ యాదవ్ నెల్లూరు శిక్షణ కేంద్రానికి బదిలీపై వెళ్లారు.